ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 21 ఆగస్టు 2024



పవన్‌కళ్యాణ్ సభకు పకడ్బందీ ఏర్పాట్లు

- సభాస్థలంలో 3 వేల మంది
- ఏర్పాట్లలో జనసేన నాయకులు



పవన్‌కళ్యాణ్ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న జనసేన నాయకులు

రైల్వేకోడూరు, ఆగస్టు 20: మైసూరివారిపల్లెలో ఈనెల 23న గ్రామసభ నిర్వహించడానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వస్తున్నారు. గ్రామసభకు ఏర్పాట్లు చేయడానికి గ్రామంలోనే స్థలాన్ని చదును చేయించే పనుల్లో మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్‌లు పగడాల వెంకటేష్, జోగినేని మణి, సీనియర్ నాయకుడు పగడాల చంద్రశేఖర్ మంగళవారం నుంచి నిమగ్నమయ్యారు. జిల్లా యంత్రాంగం అంతా మైసూరివారిపల్లెపైనే దృష్టి పెట్టింది. గ్రామసభ నిర్వహించే ప్రాంతంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. మైసూరివారిపల్లెకు దగ్గరలోనే హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. 23న ఉదయం 9 గంటలకు విజయవాడలో ప్రత్యేక హెలికాప్టర్‌లో పవన్‌కళ్యాణ్ బయలుదేరుతారు. మైసూరివారిపల్లె హెలిప్యాడ్ వద్దకు 10 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి కారులో సభాస్థలికి చేరుకుంటారు. ప్రజా వినతులు తీసుకుని, మైసూరివారిపల్లె గ్రామ పంచాయతీలోని సమస్యలు, పరిష్కార మార్గాలపై ప్రసంగిస్తారని జనసేన నాయకులు తెలిపారు. గ్రామసభలో 3 వేల మంది కూర్చునే విధంగా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు వివరించారు. వేదికపై జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఉంటారని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

నిష్పక్షపాతంగా ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్

మదనపల్లెటౌన్, ఆగస్టు 20: మదనపల్లె మండలంలో నిర్వహిస్తున్న ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని బొమ్మనచెరువు గ్రామంలో ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్‌ను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వెళ్లి రైతుల సమక్షంలోనే రీవెరిఫికేషన్ చేయాలన్నారు. ఎవరైనా రైతులు ఆక్షేపిస్తే వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించి ఫ్రీహోల్డ్‌కు దరఖాస్తు చేసిన భూములను రిజెక్ట్ చేయాలన్నారు. ప్రతి సర్వే నెంబర్, అందులో ప్రభుత్వ, డీకేటీ, చుక్కల భూములను ఏ రిజిస్టర్, ఆర్ఓఆర్, నెంబర్-4 రిజిస్టర్‌లను పరిశీలించాక అన్ని సక్రమంగా ఉంటేనే ఆమోదించాలన్నారు.

ఎన్‌హెచ్-71కు భూసేకరణ వేగవంతం చేయాలి

మదనపల్లె నుంచి పీలేరు వరకు నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్-71 నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూసేకరణను వేగవంతం చేయాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని తట్టివారిపల్లె వద్ద బైపాస్‌రోడ్డు, తిరుపతి రోడ్డు జంక్షన్ వద్ద ఇళ్ల స్థలాలు, భూములను పరిశీలించారు. ఎవరి భూములు, ఇళ్ల స్థలాలు ఎంత కోల్పోనున్నారో లెక్క వేసి, వారికి ఎంత నష్టపరిహారం చెల్లించాలో నివేదికలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, సర్వేయర్ సుబ్రమణ్యం, భూసేకరణ డీటీ గురుప్రసాద్, ఎన్‌హెచ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



బొమ్మనచెరువు గ్రామంలో ఫ్రీహోల్డ్ భూముల రీవెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మైసూరివారిపల్లెకు మహర్దశ





మైసూరివారిపల్లె వ్యూ

- రాష్ట్రంలోనే ఆదర్శ పంచాయతీ!
- ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్
- వైసీపీ పాలనలో జనసేన మద్దతు సర్పంచ్ మహిళ విజయమే కారణం

రైల్వేకోడూరు, ఆగస్టు 20: రైల్వేకోడూరు నియోజకవర్గ కేంద్రం పరిధిలో ఉన్న మైసూరివారిపల్లెకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలోనే ఆదర్శ పంచాయతీ కానుంది. ఈ పంచాయతీపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. 2020లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుతో సర్పంచ్ స్థానానికి పోటీలో ఉన్న కారుమంచి సంయుక్త విజయాన్ని వైసీపీ నాయకులు అడ్డుకోవాలని చూశారు అయినా పంచాయతీ ప్రజలు ఏకతాటిపైకి వచ్చి ఆమెకు విజయాన్ని అందించి పవన్‌కళ్యాణ్‌కు అంకితం చేశారు. సర్పంచ్ సంయుక్త భర్త కారుమంచి వెంకట సుబ్బయ్య మాజీ సైనికుడు. రోడ్డు ప్రమాదంలో మరణించాడు. భర్త లేని బాధను దిగమింగుకుని జనసేన పార్టీ పట్ల ఉన్న అంకితభావంతో ప్రజాబలంతో ఆమె సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అదే కాకుండా గతంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా జనసేన పార్టీ అభ్యర్థి వరికూటి నాగరాజు విజయం సాధించారు. ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులకు గురి చేసింది. అయినా పంచాయతీ ప్రజలు ఏకతాటిపైకి రావడంతో విజయం సాధ్యమైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏటిపొరంబోకు స్థలాన్ని కాజేయాలని కొందరు వ్యక్తులు దౌర్జన్యాలు చేశారు. సర్పంచ్ సంయుక్తకు అండగా నిలిచిన గ్రామస్తులు దానిని అడ్డుకున్నారు. ఎన్నో రకాలుగా పోలీసులను పెట్టి భయభ్రాంతులకు గురి చేసినా దేనికి భయపడకుండా మైసూరివారిపల్లె గ్రామ ప్రజలు ఎదురొడ్డి ఆ స్థలాన్ని కాపాడుకున్నారు. మైసూరివారిపల్లె పంచాయతీలో ఐకమత్యమే బలంగా వైసీపీ నాయకుల ఆగడాలను తిప్పికొట్టారు. ఈ పంచాయతీలో జరిగిన సంఘటనలు పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లడంతో అధికారంలోకి రాగానే మైసూరివారిపల్లె గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అనుకున్నారు. తెలంగాణా రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో ఉన్న అంకాపూర్ మాదిరిగా ఈ పంచాయతీని రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉంచాలని జిల్లా యంత్రాంగం మైసూరివారిపల్లెకు వచ్చి ప్రజా అవసరాలను తెలుసుకున్నారు. సోమవారం రాత్రి కలెక్టర్ చామకూరి శ్రీధర్ తన యంత్రాంగంతో వచ్చి ప్రజలకు ఏమి కావాలో అడిగి తెలుసుకున్నారు. ఈనెల 23న మైసూరివారిపల్లె పంచాయతీ కేంద్రంలోనే గ్రామసభ ఏర్పాటు చేస్తున్నారు. గ్రామసభకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వస్తున్నారు.

మా కష్టాలను పవన్ తెలుసుకున్నారు



మా కష్టాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలుసుకున్నారు. మా పంచాయతీలో అధికారులతో గ్రామసభ నిర్వహించి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారంటే పవన్ రుణం తీర్చుకోలేనిది. మా గ్రామాన్నే ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి పనులు చేయిస్తున్నారు.

-పగడాల చంద్రశేఖర్, జనసేన నాయకుడు, మైసూరివారిపల్లె

పంచాయతీ వివరాలు

పంచాయతీలో మైసూరివారిపల్లెతో పాటు శాంతినగర్, రాజానగర్, రాజీవ్‌నగర్, దళితవాడ, అరుంధతివాడలు ఉన్నాయి. మొదట సూరపురాజుపల్లె పంచాయతీలో మైసూరివారిపల్లె ఉండేది. తర్వాత మైసూరివారిపల్లె పంచాయతీగా మారింది. ఈ పంచాయతీలో మొత్తం జనాభా 2328 మంది ఉన్నారు. 614 కుటుంబాలు ఉన్నాయి. 1680 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1153, మహిళలు 1175 మంది ఉన్నారు.

ఇండస్ట్రియల్ ఏరియాగా ఏర్పాటు

మైసూరివారిపల్లె పంచాయతీని ఇండస్ట్రియల్ ఏరియాగా గతంలో ఏర్పాటు చేశారు. గతంలో ఈ పంచాయతీ పరిధిలో షావాలీష్ కంపెనీకి చెందిన ఈగల్ సబ్బుల పరిశ్రమ ఉండేది. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పాలసేకరణ కేంద్రం ఏర్పాటు చేశారు. సబ్బుల పరిశ్రమను లాకౌట్ చేశారు. పాల సేకరణ కేంద్రం మూతపడింది. ఈ పంచాయతీలో ప్రస్తుతం మామిడి మండీలు 75 ఉన్నాయి. దేశంలోనే ఇతర నగరాలకు కాయలను ఎగుమతి చేస్తుంటారు. మైసూరివారిపల్లెలో ఎక్కువగా రైతులు ఉన్నారు. మామిడి, బొప్పాయి, అరటి పంటలను పండిస్తారు. ఉద్యాన పంటలకు గిరాకీ ఉండడంతో రైతులు, వ్యాపారులు ఇతర ప్రాంతాలకు కాయలను ఎగుమతి చేస్తున్నారు. 126 మంది రైతులు, వ్యాపారులు ఉన్నారు. 230 మంది కూలీలు ఉన్నారు. 87.37 శాతం అక్షరాస్యత కల్గి ఉంది.

పవన్‌కళ్యాణ్ దృష్టికి 26 సమస్యలు

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి 26 సమస్యలను తేనున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి, రోడ్లు, ఆస్పత్రి, ఆటస్థలం, పక్కాగృహాలు, చుక్కల భూముల సమస్య, అరటి రైపనింగ్ ఛాంబర్, పశు వైద్యశాల, శీతల గిడ్డంగులు, ఫ్రూట్ ప్రిజర్వేషన్ ప్లాంట్, పాఠశాలకు మౌలిక సదుపాయాలు, తాగునీరు, విద్యుత్, చెక్‌డ్యాం రిపేరు, రైతుల పొలాలకు రోడ్లు, కొత్త వంగడాలు, కొత్త పంటలు, మెడిసినల్ ప్లాంట్స్, కూరగాయల పంటలు తదితరవి కావాలని పవన్‌కళ్యాణ్ దృష్టికి తేనున్నారు.

అన్ని గ్రామాలకు ఆదర్శం కావాలి



మైసూరివారిపల్లె అన్ని గ్రామాలకు ఆదర్శం కావాలి. నిజామాబాద్ జిల్లాలో ఉండే అంకాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారు. ఆ విధంగా మైసూరివారిపల్లె గ్రామ పంచాయతీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే పవన్‌కు ఎల్లకాలం రుణపడి ఉంటాం.

- పగడాల వెంకటేష్, జనసేన నాయకుడు, మైసూరివారిపల్లె

ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం



వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఇబ్బందులు, కేసులు, దాడులు తదితరవి ఎదుర్కొన్నాము. పోలీసులతో భయభ్రాంతులకు గురి చేయించారు. అయినా బెదరకుండా విజయాలను సాధించుకున్నాము. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మా గ్రామ పంచాయతీ బాగుపడుతుంటే మాకు చాలా ఆనందంగా ఉంది.

-వరికూటి నాగరాజు, జనసేన ఎంపీటీసీ సభ్యుడు, మైసూరివారిపల్లె

మా బాధలు పవన్‌కళ్యాణ్‌కు చెప్పుకున్నాం



మా బాధలు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు చెప్పుకున్నాము. ఆయన సానుకూలంగా విన్నారు. అందువల్ల మా గ్రామ పంచాయతీకి మేలు జరుగుతోంది. అభివృద్ధి చెందుతుందంటే ప్రజలకు అంతకంటే ఏమి కావాలి. మా పంచాయతీకి ఇంత మహర్దశ పడుతుందని కలలో కూడా ఊహించలేదు. పవన్‌కళ్యాణ్ గ్రామ సభను విజయవంతం చేస్తాం.

- కారుమంచి సంయుక్త, మైసూరివారిపల్లె మహిళా సర్పంచ్

పవన్‌కళ్యాణ్‌కు రుణపడి ఉంటాం



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు రుణపడి ఉంటాం. మా గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలోకి తీసుకున్నారంటే చాలా ఆనందంగా ఉంది. సమస్యలు అన్నీ పరిష్కారం అయి రాష్ట్రంలోనే ఆదర్శ పంచాయతీగా ఉంటుంది. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం వచ్చిందని ప్రజలు సంతోషంగా ఉన్నారు.

- సాధు శివరామయ్య, మాజీ సర్పంచ్, మైసూరివారిపల్లె

అమ్మో... మార్కెట్ యార్డా...!

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- యథేచ్ఛగా మద్యం.. గంజాయి విక్రయాలు....?
- మహిళా కూలీలకు వేధింపులు
- జోరుగా జూదం... గొడవలు
- రాత్రంతా మార్కెట్ నిర్వహణే కారణం



రాత్రివేళలో కళకళలాడుతున్న టమోటా మార్కెట్

ములకలచెరువు, ఆగస్టు 20: ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ యార్డు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కర్ణాటక మద్యంతో పాటు గంజాయి అమ్మకాలు కూడా ఇక్కడ జరుగుతున్నట్లు తెలుస్తోంది. పనులకు వచ్చే మహిళా కూలీలకు వేధింపులు ఎక్కువయ్యాయి. రాత్రిళ్ల పేకాట మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. రాత్రంతా కొనసాగుతున్న మార్కెట్‌తోనే అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు, పోలీసుల పర్యవేక్షణ కొరవడంతో ఈ పరిస్థితి నెలకొందన్న ఆరోపణలు ఉన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం మండలాలకు సంబంధించి ములకలచెరువు కేంద్రంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటైంది. 1977లో ఇక్కడ మార్కెట్ యార్డును ప్రారంభించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె తరువాత ప్రధాన మార్కెట్‌గా పేరొందింది. తంబళ్లపల్లె నియోజకవర్గంతో పాటు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి టమోటాలు అమ్ముకోవడానికి రైతులు ఇక్కడికి తీసుకొస్తున్నారు. రైతులతో పాటు వ్యాపారులు, కూలీలు, టమోటాలు తీసుకొచ్చే వాహనాలతో మార్కెట్ యార్డు కిక్కిరిసిపోతుంది. టమోటా మండీలో దాదాపు వెయ్యి మంది వరకు కూలీలు పనులు చేస్తున్నారు. ఇందులో అధికంగా మహిళా కూలీలు ఉన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే మార్కెట్ మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటల వరకు నిర్వహిస్తుండడంతో మహిళా కూలీలకు భద్రత కరువైంది. మార్కెట్ ముగిశాక తెల్లవారుజామున మహిళా కూలీలు ఇళ్లకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. కర్ణాటక మద్యం అమ్మకాలు ఇక్కడ జోరుగా సాగుతున్నాయి. పలువురు కూలీలు, టమోటాలు ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లే వాహన డ్రైవర్లు ఇక్కడే మద్యం తాగి వాహనాలు తీసుకుని వెళుతుండటంతో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. రాత్రంతా మార్కెట్‌లో మద్యం దొరుకుతోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మార్కెట్‌లో గంజాయి విక్రయాలతో పాటు పేకాట కూడా జోరుగా సాగుతోంది. ములకలచెరువులోని హోటళ్లు, దుకాణాల్లో పనిచేసే కొందరు దినసరి కూలీలు రాత్రి వేళల్లో మద్యం కావాలంటే మార్కెట్ యార్డుకు వెళ్లి అక్కడే తాగి వస్తున్నారు. మార్కెట్ యార్డు ఊరికి మధ్యలో ఉండడంతో చుట్టుపక్కల గృహాలు ఉన్న వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ గోడకు పలుచోట్ల ద్వారాలు ఏర్పాటు చేసుకోవడంతో మద్యం తాగిన వారు ఇళ్ల ముందుకు వెళ్లి గొడవలకు దిగుతున్నారు. దీంతో రాత్రయిందంటే ఇళ్లలో నుంచి బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జగదీష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి



మార్కెట్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. దీనిపై ఫిర్యాదులు అందుతుండడంతో టమోటా మండీ కమీషన్ ఏజెంట్లకు నోటీసులు కూడా జారీ చేస్తున్నాం. తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే టమోటా మండీ ఏజెంట్ల లైసెన్సులు కూడా రద్దు చేస్తాం. పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తాం. కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలి.



ములకలచెరువు మార్కెట్ కమిటీ కార్యాలయం

మార్కెట్‌లో జరిగిన కొన్ని ఘటనలు

- ములకలచెరువు మండలం దేవళచెరువు పంచాయతీ గోళ్లవారిపల్లె సమీపంలో టమోటా మండీలో పనిచేసే దినసరి కూలీ పసుపులేటి శ్రీనివాసులు (32) దారుణ హత్యకు గురయ్యాడు. టమోటా మండీలో పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా దారుణ ఘటన చోటు చేసుకుంది. మార్కెట్ యార్డులో ఏర్పడ్డ వివాహేతర సంబంధం కారణంగా ఇతడి భార్యే ప్రియుడితో కలిసి హత్య చేయించింది. ఏడాది క్రితం సంచలనం రేపిన ఘటనలో పోలీసులు భార్య, ప్రియుడిని అరెస్టు చేశారు.
- మార్కెట్‌యార్డులో పలువురి వివాహేతర సంబంధాలు కూడా బయటపడ్డాయి. మార్కెట్‌లో పాతుకుపోయి మండీల్లో పనిచేస్తున్న కొందరు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలు బోలేడు ఉన్నాయి. ఇవి బయటకు రాకుండా వారిని భయపెట్టారు.
- మార్కెట్ యార్డులో భారీగా పేకాట ఆడుతుండడంతో పోలీసులకు సమాచారం రావడంతో దాడి చేసి సుమారు 20 మందిని అరెస్టు చేశారు. అలాగే మట్కా, పూలురాణి తదితర జూదాలు కూడా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు పలుమార్లు దాడులు నిర్వహించారు.
- కర్ణాటక మద్యం ప్యాకెట్లు భారీగా విక్రయిస్తుండడంతో ఎస్ఈబీ పోలీసులు కూడా పలుమార్లు తనిఖీ చేపట్టారు. మార్కెట్‌లో కర్ణాటక మద్యం అమ్ముతూ స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న పలువురు కూలీలు మద్యం తాగి గొడవలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో ప్రతిరోజూ గొడవలు జరుగుతున్నాయి. ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవలే రెండు రాష్ట్రాలకు చెందిన కూలీల మధ్య నెలకొన్న గొడవ పెద్దదై కర్రలు, టమోటా బాక్సులతో కొట్టుకున్నారు.

జిల్లాలో పరిశ్రమలకు ప్రోత్సాహం

2024-29కి విధి విధానాలు రూపొందిస్తాం : కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 20: జిల్లాలో పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తామని, పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుని 2024-29కు నూతన పారిశ్రామిక విధానం రూపొందిస్తామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నూతన పారిశ్రామిక విధానంపై జిల్లా ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక సంఘాలు,మేధావి వర్గాల నుంచి వివిధ సూచనలు తీసుకున్నామని, పారిశ్రామిక ఎస్టేట్‌లో కనీస అవసరాలైన రోడ్లు, నీటి సౌకర్యం, తదితర మౌలిక సదుపాయాలు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో భూమి చాలా అందుబాటులో ఉందని, విద్యావంతులు, నైపుణ్యం కలిగిన కార్మికులు ఎక్కువగా ఉన్నారని వీరందరికీ ఉద్యోగాలు కల్పించాలంటే పారిశ్రామిక విధానాన్ని రూపొందించుకోవాలన్నారు. జిల్లాలో టమాటా, అరటి, మామిడి వంటి పళ్ల ఉత్పత్తి చాలా ఎక్కువగా ఉందని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి సూరిబాబు, జిల్లా ప్రోత్సాహక కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాజధానికి బొప్పాయి బాధితులు

- నర్సరీలపై ఉద్యాన శాఖ డైరెక్టరుకు ఫిర్యాదు
- ఎకరాకు రూ.2 లక్షలు పరిహారం ఇప్పించాలని వినతి



ఉద్యాన కమిషనరు కార్యాలయం ముందు వినతిపత్రాలు ప్రదర్శిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

కలికిరి, ఆగస్టు 20: మదనపల్లె, కలికిరి ప్రాంతాలకు చెందిన బొప్పాయి బాధితుల రైతులు రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనరును ఆశ్రయించారు. నకిలీ బొప్పాయి మొక్కలతో మోసం చేసిన నర్సరీ యజమానుల నుంచి తమకు పూర్తి స్థాయిలో ఎకరాకు రూ.2 లక్షల వంతున పరిహారం ఇప్పించాలని మొరపెట్టుకున్నారు. అటు మదనపల్లె, ఇటు కలికిరిలో వివిధ స్థాయిల్లో న్యాయం కోసం బాధిత బొప్పాయి రైతులు నెల రోజులుగా తిరుగుతున్నారు. చివరికి కలికిరి పోలీసుస్టేషన్‌లో రెండు, మూడు రోజులు జరిగిన పంచాయితీ కూడా సఫలం కాకపోవడంతో బాధితులు చివరికి ఉద్యాన శాఖ కమిషనరుకు మంగళవారం విన్నవించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య, రాష్ట్ర నాయకుడు కంజుల విఠల్ రెడ్డి, పి.వి.జనగన్నాథం తదితరులతో కూడిన ప్రతినిధుల బృందం గుంటూరులోని ఉద్యాన శాఖ కమిషనరు కె.శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ, సదుం, పెద్దమండెం, మదనపల్లె మండలాలకు చెందిన దాదాపు వంద మంది కౌలు రైతులు 500 ఎకరాలకు పైబడి విస్తీర్ణంలో బొప్పాయి పంట సాగు చేసినట్లు సంఘం నాయకులు కమిషనరుకు విన్నవించారు. మదనపలెకు చెందిన శేఖర్ రెడ్డి, కలికిరికి చెందిన యల్లారెడ్డి, రాజన్న నర్సరీల్లో రూ.11 నుంచి 15 వెచ్చించి బొప్పాయి మొక్కలు కొనుగోలు చేశారని వివరించారు. ఎకరాకు రూ.లక్షకు పైబడి పెట్టుబడులు పెట్టి సాగు చేసినా చివరకు నాసిరకం పంట రావడంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. బొప్పాయి నర్సరీ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర రాష్ట్రాల నుంచి విత్తనాలు, మొక్కలు తెప్పించి రైతులకు అంటగట్టారని చెప్పారు. ఈ విషయం స్థానిక, జిల్లా ఉద్యాన అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. దీనిపై ఉద్యానశాఖ కమిషనరు శ్రీనివాసులు సానుకూలంగా స్పందించి రైతులను మోసం చేసిన నర్సరీ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని, పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు కౌలు రైతుల సంఘం నాయకులు తెలిపారు.

వైసీపీ నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం

- పాఠశాలల్లో నిలిచిపోయిన నాడు-నేడు పనులు
- సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతోనే..
- టీడీపీ ప్రభుత్వంలోనైనా పనులు పూర్తి చేయాలి
- విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 20: గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన రెండో విడత నాడు-నేడు పనులు నిధుల లేమితో నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు అసౌకర్యాల నడుమ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రొద్దుటూరు మండలంలో 110 ప్రభుత్వపాఠశాలలు ఉండగా... 2019లో రూ.9కోట్లతో 38 పాఠశాలలో నాడు-నేడు పనులు చేపట్టి పాఠశాలలను ఆధునీకరించారు. మొదటి విడత పనులు విజయవంతం కావడంతో రెండో విడత నాడు-నేడు పనులను 66 పాఠశాలలో రూ.22 కోట్లతో చేపట్టారు. 2022 ఏప్రిల్‌లో పనులు చేపట్టాలని ఆదేశించినప్పటికీ అక్టోబరులో ప్రారంభించారు. అదనపు తరగతి గదులు, వంటగదులు, మరుగుదొడ్లు, కాంపౌండ్‌వాల్, మేజర్, మైనర్ రిపేర్లు, పాఠశాలల పరిధిలో నిర్వహించగా టెన్‌కాంపోనెంట్స్ కింద టీవీలు, ఫ్యాన్లు, బెంచీలు, లైట్లు, పెయింట్, వాల్‌పెయింటింగ్, టాయిలెట్స్ పరికరాలన్నీ ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంది.

అసంపూర్తిగా రెండో విడత పనులు

నాడు-నేడు పనులు స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీ (ఎస్‌ఎంసీ)ల ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉంది. అయితే వైసీపీ నాయకులు ఎస్‌ఎంసీ కమిటీలను పక్కనబెట్టి పాఠశాలలో పనులు చేపట్టారు. వారు ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టకుండా ఇష్టానుసారం చేయడంతో చాలవరకు పాఠశాలల్లో పనులు పూర్తికాలేదు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం, అధికారులు ఒత్తిడి తెచ్చినా.. నిధులు విడుదల కాకపోవడంతో అనేక పాఠశాలలో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని పాఠశాలలో తరగతి గదులు, మరికొన్ని పాఠశాలలో మరుగుదొడ్లు, ఇంకొన్ని పాఠశాలలో వంట గదులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం సరఫరా చేయాల్సిన టీవీలు, బెంచీలు, టాయిలెట్స్ పరికరాలను కొన్ని పాఠశాలలకు అందజేయలేదు.

పూర్తికాని పెయింటింగ్ పనులు

చాల వరకు పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా ఉంటే.. పెయింటింగ్ పనులు, వాల్‌రైటింగ్ అనేక పాఠశాలలో చేపట్టలేదు. ప్రభుత్వం పెయింటింగ్ కంపెనీలకు నిధులు చెల్లించకపోవడంతో ఆ కంపెనీలు అసంపూర్తిగా పనులు చేపట్టాయి. దీంతో తరగతి గదులు పూర్తయినప్పటికి పాఠశాలలో పెయింటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక అసంపూర్తిగా ఉన్న తరగతి గదులలోనే క్లాసులు నిర్వహిస్తున్నారు. పనులు పూర్తి చేయడానికి గడువు విధించిన అప్పటి వైసీపీ ప్రభుత్వం .. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో చాలా పాఠశాలల్లో పనులు నిలిచిపోవడానికి కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాడు-నేడు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

> **నిధులు వస్తే.. పనులు పూర్తి చేస్తాం**
>
> నిధులు విడుదలైన మేరకు రెండో విడత నాడు-నేడు పనులు పూర్తయ్యాయి. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది. నిధులు వస్తే పనులు చేయడానికి చర్యలు తీసుకుంటాం.
>
> \- సావిత్రమ్మ, ఎంఈవో, ప్రొద్దుటూరు



దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో కిటికీలు, తలుపులు లేక తరగతి గదిలోకి చేరిన వర్షపునీరు





కామనూరు ఎంపీపీ స్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న తరగతి గది, హౌసింగ్ బోర్డు కాలనీ పాఠశాలలో పునాదులకు పరిమితమైన వంట గది, ఎస్‌వీవీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాత గేటుకే కడ్డీలు అమర్చిన దృశ్యం

స్మార్ట్ మీటర్‌తో అనేక ప్రయోజనాలు

- ఉమ్మడి కడప జిల్లా విద్యుత్ ఎస్‌ఈ రమణ



అటవీశాఖ అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్ పనితీరును పరిశీలిస్తున్న రమణ

రైల్వేకోడూరు, ఆగస్టు 20: స్మార్ట్ మీటర్‌తో వినియోగదారులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఉమ్మడి కడప జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్. రమణ తెలిపారు. ఈనెల 23న ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ రైల్వేకోడూరుకు వస్తున్న సందర్భంగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్మార్ట్ మీటర్ల పనితీరు, విద్యుత్ సమస్యలపై పరిశీలించిన ఆయన మాటాడుతూ డిప్యూటీ సీఎం పర్యటనలో విద్యుత్ లోపాలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించామని తెలి పారు. స్మార్ట్ మీటర్ వల్ల వినియోగదారులకు ఏ సమయంలో ఎంత విద్యుత్‌ను విని యోగిస్తున్నామనేది ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా తెలుసుకునే సదుపాయం ఉంటుం దన్నారు. ఎక్కడ విద్యుత్‌ను వృథా చేస్తున్నారో అనేది కూడా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. గృహ విద్యుత్ ఉపకరణాలు పాడైనప్పుడు అవి విద్యుత్‌ను అధికంగా తీసుకుంటాయన్నారు. విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చాయని విద్యుత్ కార్యాలయా లకు తిరగకుండా ఎప్పటికప్పుడు ఆండ్రాయిడ్ ఫోన్‌లోని యాప్ ద్వారా విద్యుత్ వినియోగం గమనించే వీలుందన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం అనేక సంస్క రణలు చేపట్టామని తెలిపారు. రెండో విడతలో గృహాలు, వాణిజ్యాలు తదితర వాటికి స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజి నీర్ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కర్‌రావు, అసిస్టెంట్ ఇంజనీర్ యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనక్ పట్ల విద్యార్థుల్లో స్ఫూర్తిని కలగజేయాలి : డీఈవో

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20: ఇన్‌స్పైర్ మనక్ పట్ల విద్యార్థులకు స్ఫూర్తిని కలగజేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి అనురాధ అన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఇన్‌స్పైర్ మనక్‌కు సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా పేరును ఉన్నతంగా ఉంచాలని సూచించారు. సమస్యలను విద్యార్థులు గుర్తించి... పరిష్కారం విద్యార్థి కనుగొనేటట్లు చేయాలని... ఉపాధ్యాయులు కేవలం మార్గదర్శకం వహించాలని చెప్పారు. సోషల్ ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను గైడ్ చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో కడప ఉపవిద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్, ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారి పలువురు పాల్గొన్నారు.

కార్ డెకార్స్‌లో అగ్ని ప్రమాదం

రాజంపేట టౌన్, ఆగస్టు 20: రాజంపేట పట్టణంలోని ఉస్మాన్‌నగర్ బైపాస్‌రోడ్డులో మంగళవారం వీఆర్ కార్ డెకార్స్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. వీఆర్ కారు డెకార్స్ యజమాని వెంకటరమణ మధ్యా హ్నం భోజనానికి వెళ్లాడు. ఆ సమయంలో షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి యజమానికి సమాచారం అందించారు. షాపు వద్ద దట్టమైన పొగలు కమ్ముకోవడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడానికి ప్రయత్నించారు. అప్పటికే షాపులో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు యజమాని పేర్కొన్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు



యావజ్జీవ కారాగార శిక్ష పడ్డ నాగరాజు

చెన్నూరు, ఆగస్టు 20 : మండలంలోని కొండపేటకు చెందిన జ్యోతి అనే మహిళను హత్య చేసిన ఘటనలో బోయ నాగరాజు అనే వ్యక్తికి జీవిత ఖైదు పడింది. జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి సెషన్స్ జడ్జి షేక్ ఇంతియాజ్ హమీద్ మంగళవారం వెలువరించిన తీర్పులో బోయ నాగరాజుకు వెయ్యి రూపాయల జరిమానాతో పాటు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. మండలానికి చెందిన జ్యోతి, ఆమె భర్త రంగనాయకులు బుక్కరాయసముద్రంకు చెందినవారు. వారు కొండపేటకు బతుకుదెరువు నిమిత్తం వచ్చారు. ఈ క్రమంలో బోయనాగరాజు ఆమెను ఇంట్లో ఎవరూ లేని సమయంలో 17.2.2022న హత్య చేశాడు. అప్పట్లో ఎస్ఐగా ఉన్న శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ అనంతరం మంగళవారం బోయనాగరాజుకు యావజ్జీవకారాగార శిక్ష విధించినట్లు చెన్నూరు సీఐ పురుషోత్తంరాజు తెలిపారు.

స్మగ్లర్లు పరార్... వాహనం స్వాధీనం

సుండుపల్లె, ఆగస్టు 20: ఎర్రచందనం అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించగా.. వారిపై దాడి చేయడంతో పరార్ అయినట్లు సానిపాయి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో పీలేరు రహదారి నుంచి సుండుపల్లె మీదుగా డస్టర్ వాహనంలో స్మగ్లర్లు అడవిలోకి ప్రవేశించేందుకు 6 మంది ప్రయత్నించారు. వారిని వెంబడించగా ఎదురుగా వచ్చిన ఒక ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి, ఫారెస్టు సిబ్బంది వాహనాన్ని ఆపుతున్న ఆపకుండా ఐదుగురు స్మగ్లర్లు వానరాచపల్లి సమీపంలో పారిపోయారు. ఒక వ్యక్తి వాహనాన్ని తీసుకొని పారిపోతుండగా వెంబడించడంతో రాయచోటి సమీపంలో గంగోత్రి ఫ్యాక్టరీ వద్ద వాహనాన్ని వదిలిపెట్టి పరారయ్యారన్నారు. వాహనంతో పాటు 5 గొడ్డళ్లు, ఒక రంపం, 8 చిన్న చిన్న బియ్యం ప్యాకెట్లు, ఆరు బ్యాగులు, ఇతర సామాగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన స్మగ్లర్ల కోసం ఫారెస్టు అధికారులు గాలిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌వో రజిని, డీఆర్‌వో రమేశ్‌బాబు, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా - 13 మందికి గాయాలు

బద్వేలు రూరల్, ఆగస్టు 20 : మండల పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామానికి చెందిన కూలీలు మంగళవారం పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 13మందికి తీవ్ర గాయాలయ్యాయి. బి.మఠం మండలంలోని సోమిరెడ్డిపాలెంకు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి వచ్చే క్రమంలో నేలటూరు గ్రామ సమీపంలోకి రాగానే ముళ్లపొదల్లో నుంచి గేదె రోడ్డుపైకి అకస్మాత్తుగా అడ్డు వచ్చింది. దీంతో ఆటో గేదెను ఢీకొట్టి బోల్తాపడటంతో కూలీలు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం బద్వేలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవరు కాశి, వెంకటమ్మల పరిస్థితి విషమంగా ఉండడంతో కడపకు తరలించినట్లు బంధువులు తెలిపారు.

ప్రశ్నించే తత్వం అలవరచుకోవాలి : వీసీ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20: స్వీయత లేని ఫలితాలను నమ్మవద్దని, ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి అన్నారు. మంగళవారం వైవీయూ ఎన్ఎస్ఎస్, జేవీవీ ఆధ్వర్యంలో నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన సాంకేతికతతో దేశం పురోగమిస్తుంటే మరో వైపు మూఢ నమ్మకాలు విశ్వసిస్తుండడం బాధాకరమన్నారు. ఆర్థిక స్వావలంబనతో శాస్త్రీయత సాధ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. రిజిస్ట్రారు రఘునాథరెడ్డి మాట్లాడుతూ బాల్యదశ నుంచే పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలన్నారు. జేవీవీ రాష్ట్ర కోశాధికారి రాజశేకర్‌రాహుల్ మాట్లాడుతూ సైన్స్ మార్పును కోరుతుందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ విశ్రాంత మేనేజరు గోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు సునీత, సరస్వతి, బాల బయన్న, వెంకటేశ్వర్లు, శివరాం, కిరణ్, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలి



పీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా చేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

కడప (మారుతీనగర్), ఆగస్టు 20: ఆర్టీసీ ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.9వేలు చెల్లించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌తో జీవనం కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం వద్ద నాలుగు జిల్లాల (కడప-కర్నూలు-అనంతపురం- చిత్తూరు)కు చెందిన నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వై.రాజారెడ్డి, ఎంవీ నారాయణ, రవీంద్రనాథ్‌వర్మ, (కడప) నాగయ్య, వైసీఎస్ రెడ్డి (అనంతపురం) జేఎంఆర్ నాయుడు, శేషాద్రి, (చిత్తూరు) శ్రీనివాసులు, (కర్నూలు) మాట్లాడారు. చాలీ చాలని పెన్షనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విచారం వ్యక్తం చేశారు. ముఖ్యంగా షుగర్, బీపీ సమస్యలతో సతమతమవుతున్న వారికి వచ్చే పెన్షన్ డబ్బులు సరిపోకపోవడం వల్ల ఇతర కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తమ గోడును అర్థం చేసుకుని కనీస పెన్షన్ రూ. 9వేలు అందేలా చూడాలన్నారు. ప్రధానంగా హయ్యర్ పెన్షన్ అమలు చేసే క్రమంలో జాప్యాన్ని నివారించి సత్వరమే మంజూరు చేయాలన్నారు. హయ్యర్ పెన్షన్ లెక్కించే విధానం గురించి అభ్యర్థికి తెలియపరచాలన్నారు. ప్రధానంగా హయ్యర్ పెన్షన్ లెక్కింపులో ఈపీఎఫ్ ఇచ్చిన చట్టవిరుద్ధమైన ఆటంకాలను రద్దుచేయాలన్నారు. నిరసన కార్యక్రమం అనంతరం వినతిపత్రాన్ని సంబంధిత కార్యాలయ కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లి, పిల్లల మృతికి సచివాలయ ఉద్యోగే కారణం

ఆమెను వెంటనే అరెస్టు చేయండి : ఎస్పీకి మృతురాలి బంధువుల ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేసిన మృతురాలు రమాదేవి బంధువులు

రాయచోటిటౌన్, ఆగస్టు 20: స్థానిక కొత్తపేట తొగటవీధి వాసి రమాదేవి, ఆమె ఇద్దరు పిల్లలు అనుమానాస్పదస్థితిలో చనిపోవడానికి కారకులైన గున్నికుంట్ల సచివాలయ ఉద్యోగినిపై కేసు నమోదు చేసి తక్షణం ఆమెను అరెస్టు చేయాలని మృతురాలి సోదరుడు నారాయణ, ఆమె బంధువులు ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు ఎస్పీ కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తల్లీబిడ్డలు మృతి చెందిన వీధిలోనే గున్నికుంట్ల సచివాలయం ఉద్యోగిని నివాసం ఉంటోందన్నారు. రమాదేవి భర్త కువైత్ వెళ్లక ముందు ఈమెతో వివాహేతర సంబంధం కొనసాగిందని ఆరోపించారు. వృత్తి రీత్యా టైలర్ అయిన రమాదేవి వద్ద ఈమె బట్టలు కుట్టించుకుంటూ సఖ్యతగా మెలిగేదన్నారు. సచివాలయ ఉద్యోగిని భర్త ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనేవాడని అన్నారు. భర్త కువైత్‌కు వెళ్లిన తర్వాత రమాదేవితో సచివాలయ ఉద్యోగి భర్త స్నేహంగా ఉంటూ ఆమె నుంచి లక్షలాది రూపాయలు అప్పు తీసుకున్నాడన్నారు. ఈ నేపథ్యంలో భార్యపై అనుమానంతో రమాదేవి భర్త తమ ఇంట్లో ప్రతి గదిలో సీసీ కెమెరాలు బిగించి తన సెల్‌ఫోన్‌కు కనెక్ట్ చేసుకుని కువైత్ నుంచే పర్యవేక్షించేవాడు. సీసీ కెమెరాల్లో రమాదేవి 10 నిమిషాలు కనపడకపోతే వెంటనే అతను కువైత్ నుంచి సచివాలయ ఉద్యోగినికి ఫోన్‌చేసేవాడు. అంతేకాకుండా రమాదేవికి తన భర్తతో వివాహేతర సంబంధం ఉందంటూ సచివాలయ ఉద్యోగి నిత్యం వేధిస్తూ ఉండేది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగిని భర్త కువైత్ నుంచి రాయచోటికి రాబోతున్నాడని తెలుసుకుని తనకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వాలని రమాదేవి మూడు రోజుల కిందట వారి ఇంటికి వెళ్లి డిమాండ్ చేసింది. తన భర్తతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఊగిపోతున్న ఆమె ఈ సంఘటనతో మరింత రెచ్చిపోయి గత శనివారం రాత్రి పదిన్నర గంటలకు రమాదేవి ఇంటి వద్దకు వచ్చి పెద్దగా రభస చేసింది. ఆమె అరుపులకు భయపడిపోయిన రమాదేవి, ఆమె పిల్లలు లోపల గడియ పెట్టుకుని ఇంట్లో ఉండిపోయారు. అంతటితో ఆగని ఆమె ఇనుప రాడ్డు తీసుకుని వాకిలి తీస్తావా లేదా అంటూ గేటును గట్టిగా కొట్టి.. రాత్రంతా నానా రభస చేసింది. ఆమె గొడవ చేసిన అనంతరం రమాదేవి నుంచి కొన్ని మెసేజ్‌లు ఒకే సమయంలో ఇద్దరు, ముగ్గురికి వచ్చాయన్నారు. ఇదిలా ఉండగా రమాదేవి బిడ్డలు సహా గ్యాస్ లీక్ చేసుకుని గదిలో చనిపోయిందని రాయచోటి పోలీసులు చెబుతున్నారన్నారు. ఈమె మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఆమె మృతికి సచివాలయ ఉద్యోగే కారణమన్నారు. ఆ రోజు రాత్రి ఏమి జరిగిందో.. తక్షణమే సీసీ ఫుటేజి విడుదల చేయాలని రమాదేవి బంధువులు పోలీసులను కోరారు. ఈ సంఘటనలో సచివాలయ ఉద్యోగి, ఆమె అనుచరులను అరెస్టు చేసి.. న్యాయం చేయాలని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో మృతురాలు రమాదేవి సోదరుడు నారాయణ, బంధువులు కోరారు.

గండికోటలోకి 2000 క్యూసెక్కుల వర్షపు నీరు

కొండాపురం, ఆగస్టు 20: ఎగువప్రాంతాల్లో సోమవారం అర్థరాత్రి కురిసిన వర్షానికి గండికోట ప్రాజెక్టులోకి 2000 క్యూసెక్కుల వర్షపునీరు చేరినట్లు డీఈ ఉమామహే శ్వర్లు తెలిపారు. అదే విధంగా జీఎన్ ఎస్ఎస్ కెనాల్ ద్వారా 10,800 క్యూసె క్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోందన్నారు. సీబీఆర్ లిఫ్టులకు 500 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయ సాగర్‌కు 500 క్యూసెక్కుల నీటిని గండికోట నుంచి వదులుతున్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 10.292 టీయంసీల నీరు నిల్వ ఉంది.


పోట్లాట !

- కడప సెక్రటరీ వర్సెస్ అనంతపురం ప్రెసిడెంట్
- ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో కోల్డ్‌వార్
- అసౌకర్యాలతో క్రీడాకారుల అవస్థలు
- జాతీయ ఫుట్‌బాల్ పోటీల వేదికగా విభేదాలు బహిర్గతం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20: ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో కోల్డ్‌వార్ నడుస్తోంది. నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో గత మూడు వారాలుగా నిర్వహిస్తున్న జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీల వేదికగా విభేదాలు బహిర్గతమయ్యాయ. పోటీలకు జాతీయ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ, రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి విద్యాధీధర్ హాజరవుతారని చెప్పారు. అయితే నిర్వాహకులైన ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ, కడప జిల్లా సెక్రటరీ డేనియల్ ప్రదీప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మధ్య విభేదాలు, సమన్వయ లోపంతో ఆయ నకు ఆహ్వానం పంపలేదని సమాచారం. ఈక్ర మంలోనే ప్రారంభ వేడుకల్లో సైతం ఎవరికి వారుగా వేర్వేరుగా ఇద్దరూ ఉండి పోయారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ కూడా అలా వచ్చి ఇలా వెళ్లి పోయారు. అంతా ఫొటోలకు ఫోజులిచ్చేవరకు ఉన్నారు. ముఖ్య అతిథులు వెళ్లిపోగానే గ్రౌండ్ మొత్తం ఖాళీ అయిపోయింది. ఇక అప్పటి నుంచి క్రీడాకారులకు సరైన భోజనం, వసతి అందడం లేదు. సమస్య ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచక క్రీడాకారులు మిన్నకుండి పోయారు. ప్రధాన నిర్వాహకులు డేనియల్ ప్రదీప్, వేణుగోపాల్‌లు మైదానంలో కనబడరు. ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ క్రీడాకారులను సమస్యల్లోకి నెట్టేశారు. సరైన షెడ్యూల్, ప్రోగ్రామింగ్ లేక పోటీల నిర్వహణ సైతం ఆలస్యంగా జరుగుతోంది. సెమీస్ పోటీల్లో ఎవరితో ఎవరు పోటీ పడాలో అర్థం కాని పరిస్థితుల్లో జట్ల మధ్య విభేదాలు సృష్టించారు. ఇక సెమీస్ పోటీలు జరిగిన ఆదివారం క్రీడాకారులకు సరైన భోజనం లేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పోటీ లకు సంబంధించి విరాళాలు కూడా ఎవరికివారు వేర్వేరుగా వసూలు చేసినట్లు సమాచారం. దీనిపై జాతీయ ఫెడరేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు పలువురు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

జాతీయ పోటీల వేదికగా తమకు కలుగుతున్న అసౌకర్యాలపై పలు రాష్ట్రాల క్రీడాకా రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ తీరు సక్రమంగా లేదని ఏపీ, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కడప, అనంత పురం అధ్యక్ష, కార్యదర్శులు మధ్య తలెత్తిన మనస్పర్థలు, ఆధిపత్య పోరుతో ఇలా చేయడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఆయా రాష్ట్రాల క్రీడాకారులు, మేనేజర్లు ఇక్కడ జరుగుతున్న వాస్తవాలను జాతీయ ఫుట్‌బాల్ ఫెడరేషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పినట్లు సమాచారం.

జాతీయ ఫుట్‌బాల్ బాలికల పోటీలప్రారంభోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్)



నిందితులను ఉరితీయాలి

విద్యార్థి సంఘాల డిమాండ్ ● మానవత, బీజేపీ శ్రేణులు, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ





ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థి సంఘ నేతల నిరసన - కొవ్వొత్తులతో ర్యాలీ చేపడుతున్న మానవత, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు

రాయచోటిటౌన్, ఆగస్టు20: జూనియర్ డాక్టర్‌పై అతిక్రూరంగా దాడి చేసి హత్యాచారం చేసిన నిందితులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ), ప్రగతిశీల విద్యార్థి సంఘం (పీఎస్‌యూ) నేతలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన దాడి బాధాకరమన్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు మహిళలకు ఇంటాబయట రక్షణ లేదని, ఇందుకు నంద్యాల జిల్లా ముచ్చుమర్రి ఘటన, కలకత్తా మెడికోపై జరిగిన సంఘటనలే నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. కలకత్తా ఘటనలో నిందితులు అనేక మంది ఉన్నట్లు ఆమె పోస్టుమార్టం రిపోర్టులో స్పష్టంగా అర్థం అవుతోందన్నారు. పోలీసులు, ప్రిన్సిపాల్ ఆమెది ఆత్మహత్య అని ఆమె తల్లిదండ్రులకు తెలియజేయడం అనుమానాలకు దారి తీస్తోందన్నారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారంలో కీలక వ్యక్తులు ఉన్నారనే అనుమానం దేశ ప్రజల్లో నెలకొందన్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి ఒక మహిళా ముఖ్యమంత్రిగా ఉంటూ మహిళలకు అన్యాయం జరిగితే ఇంతవరకూ నిందితులను పట్టుకోలేని స్థితిలో ఉండడం సిగ్గుచేటన్నారు. జూనియర్ డాక్టర్ కేసును సీబీఐకు బదిలీ చేసి చేతులు దులుపుకోకుండా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు బాలాజీ, వినయ్, రాము, వహీద్, లెక్చరర్ సుబ్బరాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ లెక్చరర్ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో నిరసన ర్యాలీ

రాయచోటిటౌన్, ఆగస్టు20: కోల్‌కత్తా జూనియర్ డాక్టర్ ఘటనలో నిందితులను బహిరంగంగా శిక్షించాలని బీజేపీ సీనియర్ నేత, మానవతశాఖ చైర్మెన్ అరమాటి శివగంగిరెడ్డి, అధ్యక్షుడు ఖాదర్‌బాషా, గౌరవ సలహాదారుడు వెంకట్రమణ, మాజీ అధ్యక్షుడు చింతం వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. కలకత్తాలో ఇటీవల జరిగిన వైద్యురాలి హత్యను నిరసిస్తూ జగదాంబ సెంటర్ నుంచి మానవత సభ్యులు, బీజేపీ శ్రేణులు, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక కొత్తపేట రామాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం, బస్టాండు సర్కిల్ మీదుగా నేతాజీ కూడలి వరకు కొనసాగింది. నేతాజీ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని నినాదాలతో హోరెత్తించారు. ఈ ర్యాలీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ చంద్రశేఖర్, రూరల్ సీఐ తులసీరామ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మానవత కో చైర్మెన్ షకీల్, ఉపాధ్యక్షుడు గంగాధర్‌నాయుడు, మాజీ అధ్యక్షుడు గుండ్లూరు వెంకటేశ్, మానవత కుటుంబ సభ్యులు విశ్వహిందూ పరిషత్ నాయకులు సుబ్బయ్యస్వామి, భాను, బీజేపీ నాయకులు వెంకట్రామరాజు, జయచంద్ర, హరినాధరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీని వెంటనే అమలు చేయాలి

సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట భవన కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న భవన కార్మికులు

రాజంపేట, ఆగస్టు 20: నియోజకవర్గ పరిధిలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి మార్కెట్, పాతబస్టాండ్ కూడలి మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపిన వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా రాజంపేట పరిసరాల్లో వేలాది మంది భవన నిర్మాణ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. రాజంపేట నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ట్రాక్టర్ ఇసుక రూ.7 వేలు, టిప్పర్ ఇసుక రూ.30 వేలు అక్రమ రవాణా చేసి అమ్ముకుంటున్నారని వాపోయారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు రాధాకృష్ణ, ఎంఎస్ రాయుడు, సికిందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు వెంకటయ్య, నరసింహ, మహ్మద్ హుస్సేన్, నన్నేసాహెబ్, కాయల రమణ, ఈ రమణ, వెంకప్ప, భాస్కర్, సుబ్రహ్మణ్యం, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లెలో పొలంబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిద్దవటం, ఆగస్టు 20: లింగంపల్లిలో పొలంబడి నిర్వహించారు. ఖరీఫ్‌లో ప్రతి శుక్రవారం వరిపంటలో విత్తనం నుంచి కోత వరకు రోజూ ఉదయం 8 గంటల నుంచి 12 వరకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రికార్డులు నిర్వహణ పక్కాగా ఉండాలని వ్యవసాయ అధికారి రమేష్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సింగరయ్య, చిన్నక్క వ్యవసాయ సంచాలకులు నాగరాజు సూచించారు. మిత్ర, శత్రు పురుగుల గుర్తింపు, స్వల్ప, దీర్ఘకాలిక ప్రయోగాల గురించి వివరించారు. పురుగుల మందులు, వాటి దుష్పరిణామాలు వివరించారు. రైతుల అవగాహన స్థాయి తెలుసుకునే నిమిత్తం బ్యాలెట్ టెస్ట్ నిర్వహించామన్నారు. నారు కొనలు తుంచి నాట్లు వేయడం మంచిదన్నారు. 30 మంది రైతులు 25 ఎకరాల విస్తీర్ణంలో రెండెకరాల అధ్యయన క్షేత్రంలో పొలంబడి నిర్వహిస్తామన్నారు. టక్కోలి రైతుసేవా కేంద్రం, వ్యవసాయ సహాయకులు, ఆకుల వంశీ, శివ, ఫణీంద్ర, ఐసీఆర్‌పీలు భాగ్యలక్ష్మీ, వరలక్ష్మీ, లక్ష్మీదేవి, మాధవీలత, రైతులు పాల్గొన్నారు.


వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావాలి : ఆర్డీఓ



ఆర్డీఓ రంగస్వామిని సన్మానిస్తున్న జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు

రాయచోటిటౌన్, ఆగస్టు20: వినియోగదారులు మోసపోకుండా వారిలో చైతన్యం తీసుకురావాలని రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి రంగస్వామి సూచించారు. జిల్లా వినియోగదారుల ఫోరం రాయచోటి డివిజన్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారులను చైతన్య పరచడం మంచిదని అభినందించారు. నాసిరకం వస్తువులు కొనుగోలు చేసి మోసపోతున్న వినియోగదారులు ఎక్కడ చెప్పుకోవాలో, ఎక్కడ న్యాయం దొరుకుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. అనంతరం వినియోగదారుల ఫోరం రాయలసీమ నేత దర్బార్‌బాషా, అధ్యక్షుడు రవిశంకర్ మాట్లాడుతూ ఏదైనా వస్తువులు కొన్నప్పుడు ప్రజలు ఖచ్చితంగా ఆ వస్తువుల బిల్లులు తీసుకోవాలని, అందులో వారంటీ ఉంటుందన్నారు. కొనుగోలు చేసిన వస్తువుల్లో ఏదైనా పాడైనా, షాప్ యజమాని ఎక్కువ ధరకు అమ్మినా జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం వారు ఆర్డీఓను సన్మానించారు. వినియోగదారుల సభ్యులు సురేంద్రారెడ్డి, వెంకటేశ్ నాయుడు, సిద్దయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

నీటి విడుదల పైపులు తొలగింపు



కత్తిరించబడిన పైపులు

సుండుపల్లె, ఆగస్టు 20: ఝరికోన నుంచి పొలాలకు వెళ్లే పైపులను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఝరికోనలో పుష్కలంగా నీరు ఉండడంతో దిగువ భాగంలో బాహుదానదికి ఇరువైపులా ఉన్న సుండుపల్లె మండల రైతాంగానికి సాగునీటి సమస్య లేకుండా ఇటీవల అధికారులు నీటిని విడుదల చేశారు. నీరు విడుదలతో మండల రైతాంగం హర్షం వ్యక్తం చేశారు. అయితే బాహుదాలో నీరు ప్రవహించకపోవడంతో అనుమానం వచ్చిన అడవిపల్లి రైతులు ఝరికోన వద్ద పరిశీలించగా పైపులు పెరికేయడం, కొన్ని పైపులు కత్తిరించి ఉండడం గమనించి దిగువ ప్రాంత రైతులకు తెలిపారు. ఈ విషయంపై ప్రాజెక్టు అధికారులను వివరణ కోరగా పైపులను తొలగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని విడుదల చేసేందుకు పైపులు ఏర్పాటు చేశామని తెలిపారు.

అభ్యసనా సామర్థ్యాలను పెంచాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి



ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డీఈఓ

సంబేపల్లె, ఆగస్టు20: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో మంగళవారం పాఠశాలను సందర్శించిన ఆయన సీబీఎస్‌సీ పరీక్షల సంసిద్ధత కోసం నిర్వహిస్తున్న బేస్‌లైన్ మాక్ టెస్ట్ రాస్తున్న టెన్త్ విద్యార్థులకు పరీక్షలు, ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి టెన్త్, ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలను, టీచింగ్ డైరీలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొలేరో బోల్తా - తప్పిన ప్రమాదం



బొలెరోను పక్కకు తొలగిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్, ఆగస్టు 20: స్థానిక పాతబస్టాండు కూడలిలో అరటికాయలు లోడుతో వేగంగా వెళుతున్న బొలెరో వాహనం బోల్తా పడింది. పాతబస్టాండ్ కూడలిలో నిత్యం వాహనాలు, వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు అధిక శాతంలో ప్రయాణికులు ఈ ప్రాంతంలో ఉంటారు. మధ్యాహ్నం పెద్దగా రద్దీ లేని సమయంలో బొలెరో ప్రమాదానికి గురవడంతో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది జరగక త్రుటిలో ప్రమాదం తప్పింది. దీంతో ఆప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు, పోలీసులు క్రేన్ సహాయంతో వాహనాన్ని తొలగించారు.

పశువులకు టీకాలు వేయించాలి



గొల్లపల్లెలో గేదెకు టీకాలు వేస్తున్న దృశ్యం

రాజంపేట, ఆగస్టు 20: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా 18వ తేదీ వరకు గాలికుంటు నిరోధక టీకాలు వేస్తున్నారు. నాలగు నెలలు దాటిన అన్ని ఆవులు, గేదెలకు టీకాలు వేయాలని రాజంపేట డివిజనల్ ఉప సంచాలకులు డాక్టర్ వై.విజయ్ భాస్కర్‌రావు తెలిపారు. గొల్లపల్లె, నార పురెడ్డిపల్లెలో గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ టీకాలను ప్రతి పాడిరైతూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా 185 గేదెలకు టీకాలు వేశామన్నారు. రాజంపేట ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్, జేవీఓ ఎం.వరదయ్య, ఎల్ఎస్‌ఏ బసరాజు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెంలో...



టీకా వేస్తున్న పశువైద్యాధికారి

చిన్నమండెం, ఆగస్టు20: పశువులకు ప్రతి రైతు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని స్థానిక పశువైద్యాధికారి గణేశ్ సూచించారు. మండల వ్యాప్తంగా 8686లు, 450 గేదెలు ఉన్నాయని వీటన్నింటికీ సెప్టెంబరు 18లోపల ప్రతి పశువుకు టీకాలు వేసేందుకు పశువైద్యశాఖ సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే 8200 గాలికుంటు డోసులు వచ్చాయని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. చిన్నమండెం మండల కేంద్రంలో పలు పశువులకు ఈ రోజు టీకాలు వేశామన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

రామాపురం, ఆగస్టు20: రాయచోటి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రెడ్డిచర్ల జయరామ వర్థంతి సందర్భంగా కుమారుడు రెడ్డిచర్ల గంగాధర బండపల్లి పంచాయతీ ప్రేమాలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. అన్నదానం గొప్ప పుణ్య కార్యక్రమమని లయన్ శివారెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ హరీష్‌చంద్ర, లయన్ పవన్‌కుమార్ నాయుడు, భానుప్రకాశ్, నందిని ట్రావెల్స్ వినోద్‌కుమార్‌నాయక్, దాత కుటుంబ సభ్యులు రెడ్డిచర్ల చంద్రకళ,రెడ్డిచర్ల శివ, ఆశ్రమ స్పింది పాల్గొన్నారు.

తిరుమల పాదయాత్రకు సంఘీభావం



కసిరెడ్డి వెంకటశివారెడ్డికి సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నేతలు

సంబేపల్లె, ఆగస్టు20: టీడీపీ అభిమాని కసిరెడ్డి వెంకటశివారెడ్డి తిరుమల పాదయాత్రకు మండల టీడీపీ కార్యకర్తలు సంఘీభావం తెలియజేశారు. రాయచోటి ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గెలిస్తే తిరుమలకు పాదయాత్రగా వస్తానని మొక్కుకున్నారు. ఆయన మంత్రి కావడంతో మొక్కు తీర్చుకుని వస్తున్న వెంకటశివారెడ్డికి మంగళవారం స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శశిధర్‌రెడ్డి, గోపాల్, టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, హేమంత్, మాధం రాజశేఖర్‌రెడ్డి, తెలుగు యూత్ హరిప్రసాద్, శేషాద్రిరెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణోత్సవానికి ఆహ్వానం



జగన్‌మోహన్‌రాజుతో యూత్ సభ్యులు

పెనగలూరు, ఆగస్టు 20: పొందలూరు, హరిజనవాడలో నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవానికి రావాలని అన్నమయ్య టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుకు పొందలూరు యువకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. రూ.70 లక్షలతో నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణోత్సవం చేపడుతున్నారు. కార్యక్రమానికి రావాలని జగన్‌మోహన్‌రాజుకు విద్యార్థి నేత రమణ, ఎస్సీసెల్ నేతలు నరేష్, రమణ, శివ, నరసింహ, కార్తీక్, నరసింహ కోరారు.

తాళ్లపాక సమస్యలపై టీటీడీ ఈఓకు వినతి



టీటీడీ ఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న నాగోతు రమేష్‌నాయుడు, భానుప్రకాష్

రాజంపేట, ఆగస్టు 20: తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాక గ్రామ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరుతూ టీటీడీ ఈఓకు రాజంపేట బీజేపీ కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేశారు. తాళ్లపాక అభివృద్ధిలో భాగంగా గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం అనేక వాగ్దానాలు చేసిందని అవి నేటి వరకూ నెరవేరలేదని గుర్తు చేశారు. ప్రధానంగా ధ్యానమందిరం పడిపోయే పరిస్థితిలో ఉందని, ఆ స్థానంలో కొత్త ధ్యానమందిరం ఏర్పాటు చేయాలని కోరారు. తాళ్లపాక నుంచి ప్రధాన రహదారి 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వరకు ట్యాంక్‌బండ్ తరహా డబల్‌రోడ్డును ఏర్పాటు చేస్తూ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. సంకీర్తన కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. అన్నమయ్య సంకీర్తనలు నిత్యం వినిపించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తాళ్లపాకకు స్వామివారి లడ్డూలు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామాక్షమ్మకు గాజుల అలంకరణ



గాజులతో ప్రత్యేక అలంకరణలో కామాక్షమ్మ

పెనగలూరు, ఆగస్టు 20: గ్రామంలో పురాతన కాలంలో నిర్మించిన నాయనదీశ్వర స్వామి ఆలయంలో ఉన్న కామాక్షమ్మ, వ ుూలవిరాట్టు కు మంగళవారం భక్తులు గాజుల అలంకరణ చేశారు. శ్రావణ మాసం బహుళ పక్షం శుభప్రదమైన మంగళవారం రోజు ప్రజలకు శుభం కలగాలని భక్తులు అమ్మవారికి రంగు రంగుల గాజులను అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. అమ్మవారి విగ్రహం నిండా గాజుల అలంకరణ, ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యూత్‌సభ్యులు పాల్గొని కామాక్షమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి వైభవంగా పూజలు

చిట్వేలి, ఆగస్టు 20: కొత్తగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి శిలాబింబ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా సాగుతున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు పూజా కార్యక్రమాలు స్వామివారి గ్రామోత్సవం మేళతాళాల మధ్య కోలాటం కన్నులపండువగా నిర్వహించారు. చుట్టుపక్కల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ధర్మకర్త కట్ట రామ్మోహన్‌రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

సుండుపల్లె, ఆగస్టు20: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముడుంపాడు పంచాయతీ పింఛా ప్రాజెక్టు దిగువ భాగంలో పింఛా నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. రొంపిచర్ల, పెనగలూరు తదితర మండలాల నుంచి వచ్చి రోజూ ప్రాజెక్టు దిగువ భాగంలో నది నుంచి ఇసుక తరలిస్తున్నట్లు స్థానిక రైతులు ఇచ్చిన సమాచారంపై పట్టుకున్నట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

రామాపురం, ఆగస్టు20: విద్యార్థి దశ నుంచే పోక్స్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రామాపురం సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకట సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల విద్యార్థులు మహిళల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవడం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థి దశలో వ్యామోహాలకు, దురలవాట్లకు ప్రలోభాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. తమ ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థిదశలో చదువుపై ధ్యాస ఉంచి చక్కగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ బాధితులను గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సిద్దయ్య

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు20: సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు గ్రామాల్లో పర్యటించి టీబీ బాధితులను గుర్తించాలని కోనంపేట వైద్యాధికారి సిద్దయ్య సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ 2027 నాటికి టీబీ రహిత భారతదేశంగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయిలో నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. టీబీ రాకుండా బీసీజీ వ్యాక్సిన్ వేయించాలన్నారు. క్షయ యూనిట్ సక్రమంగా పనిచేసి వ్యాధి నివారణకు తోడ్పడాలన్నారు.

నగదు, బంగారు నగలు చోరీ

సుండుపల్లె, ఆగస్టు 20: స్థానిక కార్తికేయనగర్‌లో గుర్తు తెలియని వారు ఇంట్లోని రూ.40వేలు నగదు, 10 గ్రాముల బంగారు నగలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుపై రూరల్ సీఐ తులసీరామ్ వివరాలు వెల్లడిస్తూ ఈనెల 13వ తేదీ తణుకు అంజనమ్మ, చంద్రశేఖర్ దంపతులు బెంగుళూరుకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చోరీ జరిగింది. సోమవారం రాత్రి పక్కింటి వారు గుర్తించి బాధితులకు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేశారన్నారు. బాధితురాలు అంజనమ్మ ఇచ్చిన సమాచారం మేరకు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో తనిఖీ చేశామన్నారు. సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ వెంకట్రమణ, హెడ్‌కానిస్టేబుల్ టీడీ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలతో ఉజ్వల భవిష్యత్తు

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు20; కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మంత్రి మండిపల్లె సోదరుడు మండిపల్లె నాగిరెడ్డి ట్రస్టు చైర్మెన్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్, 5వ తరగతి ఫ్రెషర్స్ డేలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో తాగునీటి ఇబ్బందులున్నాయని విద్యార్థులు ఆయనకు వివరించారు. టీడీపీ కార్యకర్తలు మండల మహిళా అధ్యక్షురాలు లలితమ్మ, మల్లికార్జున, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

రాయచోటిటౌన్, ఆగస్టు20: స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ డెలిగేట్ ఎస్ఎండీ గౌస్, రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మెన్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్నకృష్ణ, డీసీసీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ అలీఖాన్, డీసీసీ సెక్రటరీ బషీర్ అహ్మద్, కాంగ్రెస్ నేతలు ఎస్ఎండీ జఫరుల్లా, వెంకట్రమణ, బషీర్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కడప (క్రైం), ఆగస్టు 20: స్థానిక అల్మాస్‌పేటకు చెందిన బాలిక అదృశ్యమైనట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. బాలిక సోమవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

కడప (క్రైం), ఆగస్టు 20: రవీంద్రనగర్‌లో హసీనా (48) ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. భర్త మస్తాన్‌ఖాన్ పిల్లలతో కలిసి రవీంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. కుటుంబ, ఆర్థిక సమస్యల కారణంగా ఆమె మంగళవారం ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచశాంతి కోసం ర్యాలీ

చిట్వేలి, ఆగస్టు 20: సర్వ మానవాళి శాంతితో జీవించాలనే నినాదంతో మానవత శాంతి ర్యాలీ నిర్వహించింది. వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి పిలుపు మేరకు మానవత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తంరెడ్డి, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ పర్యవేక్షణలో విద్యార్థులతో ప్రారంభమైన ర్యాలీ వైఎస్ఆర్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు సాగింది. మానవహారంగా ఏర్పడి మౌనం పాటించారు. చిట్వేలి శాఖ చైర్మన్ విశ్వనాథం, అధ్యక్షుడు మునిరావు, కార్యదర్శి సాయిరాం, కోశాధికారి రంగారెడ్డి, డైరెక్టర్ బోర్డు సభ్యులు సురేంద్రరెడ్డి, శ్రీనివాసులు, ఏటీఎస్ ప్రసాద్, కావేరి చంద్ర, కాలేషా, వెంకటేశ్వర్లు, పెంచల్‌దాస్, దుర్గరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏర్పేడు సీఐపై ఎస్పీ సీరియస్

● నెంబర్‌గేమ్ ఆటగాళ్లపై చర్యలు తీసుకోలేదంటూ ఆగ్రహం

ఏర్పేడు, ఆగస్టు 20 : ఏర్పేడు మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోకపోవడం పట్ల సీఐ శ్రీరామ శ్రీనివాసులుపై ఎస్పీ సుబ్బరాయుడు సీరియస్ అయినట్లు సమాచారం. పాపానాయుడుపేటలో ఏటా ఆగస్టు మాసంలో నిర్వహించే ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి జనం హాజరవుతుంటారు.వీరిలో కొంతమంది డబ్బాలో చింతగింజలు పోసి ఆడే నెంబరగేమ్ అనే ఆటను లక్షల రూపాయలు బెట్టింగ్ పెట్టి ఆడుతుంటారు.పోలీసులు నిఘా వుంచి చర్యలు తీసుకుంటుంటారు. ఈసారి పదిరోజులుగా జరుగుతున్న ధర్మరాజుల స్వామి ఉత్సవాల్లో కూడా నెంబరగేమ్ నడుస్తోంది. ఈ ఆట ఆడేవారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు వారం రోజుల క్రితమే సీఐ శ్రీరామ శ్రీనివాసులును ఆదేశించారు.అయితే నెంబర్ గేమ్ నిర్వాహకులతో కుమ్మక్కైన సీఐ అలాంటిదేమీ జరగడం లేదని ఎస్పీ కార్యాలయానికి సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు.అయితే నెంబరగేమ్ జోరుగా సాగుతోందన్న సమాచారంతో రేణిగుంట డీఎస్పీకి చర్యలు తీసుకోమని ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రత్యేక నిఘా వుంచి నెంబరగేమ్ ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.13,850 స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ శ్రీరామ శ్రీనివాసులుపై ఎస్పీ సీరియస్ అయినట్లు సమాచారం.స్టేషన్‌కు సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన వారితో కూడా సీఐ అగౌరవంగా మాట్లాడుతున్నాడన్న ఆరోపణలున్నాయి.ఈ నేపథ్యంలో సీఐపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని సమాచారం.



బర్డ్‌ను భ్రష్టుపట్టించారు!

● రెడ్డెప్ప రెడ్డిపై ప్రధాన ఆరోపణలివే...



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బర్డ్‌లో ఇంప్లాంట్స్ కొనుగోలుకు కూడా రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. ఐదారు కంపెనీలు అర్హత సాధించినా ఒక కంపెనీకే ప్రాధాన్యం ఇవ్వడం, అదికూడా రూ.5వేల ధర ఎక్కువ ఉన్న ఇంప్లాంట్లను కొనుగోలు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం మూడు నెలల్లో ఆ కంపెనీకి చెందిన 366 ఇంప్లాంట్లను అమర్చారు. తక్కిన కంపెనీలవి 50లోపే వినియోగించారు.నాణ్యత లేకపోయినా, టెండరులో ఎక్కువ ధర ఉన్న ఇంప్లాంట్లనే కమీషన్ల కోసం వినియోగించారన్న అనుమానాలున్నాయి. బర్డ్‌లో కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న దాదాపు 17మంది ఆర్థోపెడిక్ సర్జన్లను నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులర్ చేశారని, దీనివెనుక పెద్దఎత్తున నగదు చేతులు మారినట్టు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు వచ్చే పేషెంట్లతో మాట్లాడుకుని అక్కడ రూ.ఐదారు లక్షలయ్యే ఆపరేషన్ తిరుపతిలో అదే వైద్యులతో రెండు,మూడు లక్ష రూపాయలతోనే చేసేస్తామని బర్డ్‌కు తీసుకొచ్చి శస్త్ర చికిత్సలను చేసి పంపినట్టు తెలుస్తోంది. ఆయా ఆస్పత్రి వైద్యులను ఇక్కడికి గెస్ట్ డాక్టర్లుగా పిలిపించుకుని వారితో ఉచితంగా సర్జరీలు చేయించి శ్రీవారి ప్రోటోకాల్ దర్శనం చేసి పంపేవారన్న ఆరోపణలున్నాయి.

ప్రత్యేకాధికారి రెడ్డెప్ప రెడ్డిపై అవినీతి ఆరోపణలు

ఇంప్లాంట్ల కొనుగోలులో అవినీతి వెలుగులోకి

రికార్డులు స్వాధీనం చేసుకున్న స్టేట్ విజిలెన్స్

తిరుపతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆర్థోపెడిక్ ఆస్పత్రి.అంతేకాదు మూడున్నర దశాబ్దాలుగా లక్షలాదిమంది జీవితాలలో వెలుగులు నింపిన దవాఖానా. అయితే గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను, సంస్థలను నాశనం చేసినట్టే తిరుపతిలోని ప్రసిద్ధ వైద్య విజ్ఞాన సంస్థ బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్)ను కూడా భ్రష్టు పట్టించేసింది. తెల్ల రేషన్ కార్డుంటే పైసా ఖర్చులేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు దొరికిన చోట ప్యాకేజీలు పెట్టి బేరాలాడారు. అడుగడుగునా రాజకీయ ప్రమేయం పెరిగిపోయింది. వైసీపీ నేతలు సిఫార్సు చేసిన వారికే కీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేసేవారన్న ఆరోపణలొచ్చిన క్రమంలో రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. వైసీపీ హయాంలో బర్డ్‌లో ప్రత్యేకాధికారిగా చేరి డైరెక్టర్‌గా చెలామణి అయిన డాక్టర్ రెడ్డెప్ప రెడ్డిపై ఇటీవల ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టిపెట్టింది. ఆయన ఘనకార్యాలకు సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు మంగళవారం బర్డ్‌కు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు.

టీటీడీ నిర్వహణలో మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న బర్డ్ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి గతి తప్పిపోయింది. బర్డ్‌కు కొత్త రెక్కలు తొడుగుతామని చెప్పుకొచ్చిన అప్పటి టీటీడీ అధికారులు సైతం రాజకీయ నాయకుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. తాజా మాజీ డైరెక్టర్ డాక్టర్ రెడ్డెప్ప రెడ్డిపై నిధుల దుర్వినియోగంతో పాటు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి నెలరోజుల క్రితం పెద్దఎత్తున ఫిర్యాదులందాయి. దీంతో రెడ్డెప్ప రెడ్డిని విచారణకు అనుమతించాలని గత నెలలో విజిలెన్స్ అధికారుల నుంచి టీటీడీ అధికారులకు మెమో జారీఅయింది. బర్డ్‌లో ఆయనకు విపరీతమైన అధికారాలు ఎవరిచ్చారు? ఇంప్లాంట్ల కొనుగోలులో ఆయన పాటించిన మార్గదర్శకాలు ఏమిటి? నోటిఫికేషన్ లేకుండా వైద్యులను ఎలా రెగ్యులర్ చేశారు? వైసీపీ సిఫారసు లేఖలతో కీళ్ల మార్పిడి కేసులు ఎన్ని చేశారు? తదితరాలపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టినట్టు తెలిసింది.

● ఎవరీ రెడ్డెప్ప రెడ్డి?

అనస్థీషియాలో డిప్లొమా చేసిన రెడ్డెప్ప రెడ్డి వైసీపీ నేతల అండదండలతో 2021లో బర్డ్ ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. బర్డ్‌లో అప్పటివరకు లేని ప్రత్యేకాధికారి పోస్టును ఆయనకోసమే అప్పటి టీటీడీ పెద్దలు సృష్టించారు. వైసీపీ పెద్దల ఆశీస్సులతో బర్డ్‌లో రెడ్డెప్ప రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అపోలో హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి గౌరవ డైరెక్టర్‌గా కొంత కాలం కొనసాగి తప్పుకున్నాక రెడ్డెప్ప రెడ్డి బర్డ్‌ను తనచుట్టూ తిప్పుకున్నారు. వైసీపీ నేతల సిఫారసు లేఖలకే కీళ్ల మార్పిడిలో ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా రాజంపేట వైసీపీ నేత ఆకేపాటి అమరనాథ రెడ్డి ఇంట్లో బర్డ్ వైద్యబృందంతో వెళ్లి మెడికల్ క్యాంప్ నిర్వహించినట్టు తెలిసింది. మే 31న అధికారికంగా రెడ్డెప్పరెడ్డి బర్డ్ ప్రత్యేకాధికారిగా రాజీనామా చేశారు. అయితే మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందన్న ఆశతో జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాలు వెలువడేంతవరకు బర్డ్ డైరెక్టర్ బంగ్లాలోనే ఉన్నారు. ఆయన అంచనాలు తారుమారు కావడంతో బంగ్లా ఖాళీ చేసి జూన్ 6న హైదరాబాద్‌కు వెళ్లిపోయి, అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సీఈవోగా చేరినట్టు సమాచారం.

సర్వీసు రోడ్డు వేయాలని ధర్నా

● ఎమ్మెల్యే చొరవతో సమస్యకు పరిష్కారం



సర్వీసు రోడ్డు కోసం ధర్నా చేస్తున్న గ్రామస్తులు, రైతులు

నింద్ర, ఆగస్టు 20: అత్తూరు దళితవాడ వద్ద సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, రైతులు బెంగళూరు-తచ్చూర్ హైవేపై మంగళవారం ధర్నా నిర్వహించారు. రోడ్డు నిర్మాణానికి వాడే వాహనాలను నిలిపివేశారు. హైవే నిర్మాణంలో భాగంగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. రోడ్డు ఎత్తు పెంచడంతో పంటలు నీటి మునుగుతున్నాయని చెప్పారు. బ్రిడ్జికి అవతల 1,300 ఎకరాల్లో నీరు చేరుతున్నాయని చెప్పారు. జీఎన్‌కండ్రిగ గ్రామానికి దారిలేక ఈదుకుంటూ వెళ్లాల్సి వస్తోందన్నారు. గతంలో ఉన్న ఆర్డీవో, తహసీల్దార్‌కు విన్నవిస్తే ఇరువైపులా సర్వీసు రోడ్డు, శ్మశానికి దారి కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఈ లోపల వారు బదిలీపై వెళ్లారని తెలిపారు. హైవే పనులు పూర్తి కావస్తున్నా సర్వీసు రోడ్డు మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. సమస్య పరిష్కరించే వరకు ధర్నా విరమించేది లేదన్నారు. సమాచారం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ హైవే కాంట్రాక్టర్లతో చర్చించి పది రోజుల్లో సర్వీసు రోడ్డు, శ్మశానం ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 20: రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీవో) బలోపేతానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. మెరుగైన, నాణ్యమైన వస్తువుల ఉత్పత్తికి, సాంకేతికతకు రైతులను ఎఫ్‌పీవోలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. రైతులు పండించే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే అంశంపై త్వరలో వారికి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పాలు, కూరగాయలు, మామిడితో పాటు ఉద్యాన పంటల సాగు, మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని చెప్పారు. ఎఫ్‌పీవోల పరిధిలో లైసెన్సు మంజూరులో పెండింగ్ ఉంచరాదన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, నాబార్డు డీడీఎం సునీల్ కుమార్, వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ, పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

పెద్దపంజాణి, ఆగస్టు 20: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. మంగళవారం బైరెడ్డిపల్లె - పుంగనూరు రోడ్డు పెద్దవెలగటూరు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. గంగవరం మండలం దండపల్లె గ్రామానికి చెందిన మురళి, రమేష్‌లు కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంలో 96 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కాగా ఇదివరకే రమేష్‌పై గంగవరం పోలీస్‌స్టేషన్‌లో మద్యం అక్రమ తరలింపు కేసులు ఉన్నాయి.

పట్టపగలు నిమిషాల్లో దోచేశాడు!

తిరుచానూరు, ఆగస్టు 20: తిరుచానూరులో మంగళవారం ఉదయం 15 నిమిషాల వ్యవధిలో ఓ ఇంట్లో చొరబడ్డ బీరువాలో ఉన్న నగ, నట్ర ఎత్తుకెళ్లాడు.పోలీసుల కథనం మేరకు... తిరుచానూరులోని కొత్త వీధిలో భారతి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. పక్కనే టైలరింగ్ షాప్ నడుపుతోంది. ఉదయం 10.30గంటల సమయంలో ఓ వ్యక్తి దర్జాగా మిద్దెపైకి వెళ్లి భారతి ఇల్లు గడియ తొలగించి బీరువాలో ఉన్న బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లాడు. కొంత సేపు తరువాత మిద్దె పైకి వెళ్లిన భారతి బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడివుండడం గమనించింది.చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, క్లూస్‌టీం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి నిందితుడి వేలి ముద్రలను సేకరించారు. సమీపంలోని ఓ పాఠశాలలో ఉన్న వీడియో ఫుటేజీని పరిశీలించగా ఓ వ్యక్తి దర్జాగా మిద్దెపైకి వెళ్లి దొంగతనం చేసిన దృశ్యాలు లభ్యమైనట్లు తెలిసింది. భారతి ఇంట్లో సుమారు 12 సవర్ల బంగారు నగలు చోరీ జరిగినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

చిత్తూరులో 'యూటర్న్ కష్టాలు'

● ఎమ్మెస్సార్ సర్కిల్‌లో వాహనాలు తిప్పలేక డ్రైవర్ల ఇబ్బందులు ● పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



యూటర్న్ తిప్పలేక ఇబ్బంది పడుతున్న బస్సు డ్రైవర్

చిత్తూరు సిటీ, ఆగస్టు 20: చిత్తూరు నగరంలోని ఎమ్మెస్సార్ సర్కిల్‌లో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన 'యూటర్న్'తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలూరు వైపు నుంచి చిత్తూరు ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే మార్గంలోని ఎమ్మెస్సార్ సర్కిల్ అసలే ఇరుకైన రోడ్డు. ఆ రోడ్డుపైనే డివైడర్లు వేసి యూటర్న్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన యూటర్న్ వల్లే ఎక్కువగా ట్రాఫిక్ జాం అవుతోంది. మరోవైపు వాహనాలు యూటర్న్ తీసేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీసీ.. పాఠశాల, కళాశాల బస్సులు పొడవు ఎక్కువగా ఉండటంతో ఈ మలుపు తిప్పలేక వెనక్కు రావాల్సి వస్తోంది. అదే సమయంలో వెనుక ఉన్న వాహనాలను ఢీకొంటున్నాయి. ఉదయం పాఠశాలకు, ఉద్యోగాలకు వెళ్ళే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్ళే సమయంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ట్రాఫిక్ జాం అవుతోంది. మరోవైపు ఎమ్మెస్సార్ బస్టాప్‌కూడా ఈ యూటర్న్ వద్దే ఉండటంతో బస్సులు ఆపుతుంటారు. బెంగళూరు, మదనపల్లె, పలమనేరు, కుప్పం, యాదమరి, గుడియాత్తం వైపు వెళ్ళే ప్రయాణికులు సైతం ఇక్కడ వేచివుంటారు. వీఐపీలు వచ్చే సమయంలో మాత్రం యూటర్న్ నిబంధనలు సడలించి నేరుగా వాహనాలను వదిలేస్తుంటారు. ఇక్కడ యూటర్న్ తీసివేస్తే ట్రాఫిక్ జాం నియంత్రించడంతోపాటు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని స్థానికులు అంటున్నారు.





యూటర్న్ తిరుగుతున్న వాహనాలు

టీడీపీ నేత కారును ఢీకొట్టి.. పరారీ





దెబ్బతిన్న టీడీపీనేత కారు - జరిగిన ఘటనను పోలీసులకు వివరిస్తున్న రఘుచంద్ర గుప్తా

బైరెడ్డిపల్లె, ఆగస్టు 20: గంగవరం మండలం నాలుగురోడ్ల సమీపంలో సోమవారం అర్ధరాత్రి టీడీపీ నేత కారును వెనుక నుంచి టెంపో ఢీకొట్టింది. ఆగకుండా వాహనం వెళ్లిపోయింది. బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకి చెందిన టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి రఘుచంద్రగుప్తా మిత్రులతో కలసి తిరువణ్ణామలై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సోమవారం రాత్రి 12 గంటలకు పలమనేరుకు చేరుకున్నారు. తన మిత్రులను అక్కడ దింపేసి.. కారు నడుపుకుంటూ ఇంటికి బయలుదేరారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గంగవరం మండలం నాలుగురోడ్ల సమీపంలోని సర్వీసురోడ్డులో వస్తుండగా ఓ టెంపోవచ్చి కారును వెనుక నుంచి ఢీకొంది. షాక్‌కు గురైన రఘుచంద్రగుప్తా తేరుకునేలోపు మళ్లీ టెంపో రెండోసారి కారును ఢీకొట్టడంతో భయాందోళనతో రఘుచంద్రగుప్తా గట్టిగా కేకలు వేశారు. టెంపో అక్కడినుంచి వేగంగా వెళ్లిపోయింది. దీనిపై ఆయన గంగవరం పోలీసులకు సమాచారమిచ్చారు. గంగవరం పోలీసులు మంగళవారం సంఘటన జరిగిన ప్రదేశాన్ని, దెబ్బతిన్న కారును పరిశీలించి రఘుచంద్రగుప్తాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడూ లేనిది ఇలాంటి సంఘటన జరగడం చర్చనీయాంశంగా మారింది. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, పలువురు నేతలు రఘుచంద్రగుప్తాను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో 30న పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 20: ఎస్వీ వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 30వ తేదీన ఉదయం 9.30 గంటలకు కళాశాలలోని సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి నిబంధనల మేరకు ఈ కౌన్సెలింగ్ జరుగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ(డీఎంఎల్‌టీ) 30 సీట్లు, డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ (డీఏఎన్ఎస్) 30 సీట్లకు సంబంధించి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు రెండు తీసుకురావాలన్నారు. సీటు పొందిన విద్యార్థులు అన్నిరకాల ఫీజులకు సంబంధించి రూ.7,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

హత్యాచార నిందితులను ఉరితీయాలి



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, ఆగస్టు20: కోల్‌కత్తాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను నడిరోడ్డుపై ఉరితీయాని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘనాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పుంగనూరులో విద్యార్థులతో కలసి ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యురాలు డాక్టర్ మానస, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నాలు తదితరులు ప్రైవేటు బస్టాండ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా నిలబడి నిరసన తెలిపారు. ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడుతున్న డాక్టర్ల ప్రాణాలు తీస్తున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఈనెల 9వ తేది ఘటన జరిగితే ఇంతవరకు పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడాలంటే భయపడేలా కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘనాయకులు మోహన్, అసిఫ్, అలీ, సుమంత్‌లతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, వి.కోట, రామకుప్పం తదితర ప్రాంతాల్లోనూ కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. హత్యాచార నిందితులను ఉరి తీయాలని నినదించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



అధ్వానంగా ఉన్న జగనన్న కాలనీ రోడ్డులో నడిచి వెళ్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వెదురుకుప్పం, ఆగస్టు 20: లే అవుట్లలో ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం కార్వేటినగరంలోని పద్మ సరస్సు, కార్వేటినగరం-పచ్చికాపల్లం మార్గంలో ఉన్న లే అవుట్లను తనిఖీ చేశారు. కొత్త కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీలను మంజూరు చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణదారులకు అదనంగా రుణాలు మంజూరు చేయిస్తామని, ఉచితంగా ఇసుక మంజూరు చేస్తామన్నారు. కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ తనిఖీ చేసి శాఖల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణపై ఉద్యోగులకు ఆదేశాలిచ్చారు. ఉద్యోగుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

కార్వేటినగరం మండలంలో ఈ-క్రాప్ ద్వారా పంట నమోదును కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు నగలపాటి నాగేశ్వరరాజు అలియాస్ నాగరాజు కలెక్టర్‌కు శాలువ కప్పి, మొక్క అందించారు. రేణిగుంట వద్ద ఉన్న షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ భగవతి, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీపతి, ఎంఈవో మంచికాయల విజయకుమార్, ఏవో హేమలత, గ్రామ సచివాలయ ఉద్యోగులు కలెక్టర్ వెంట ఉన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో దాతలకు గదుల కేటాయింపు రద్దు

తిరుమల, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దాతలకు గదుల కేటాయింపు రద్దు చేసినట్టు టీటీడీ తెలిపింది. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈక్రమంలో టీటీడీలోని వివిధ ట్రస్టులకు, పథకాలకు విరాళాలు అందించిన దాతలకు కేటాయించే గదులను రద్దు చేసినట్టు స్పష్టం చేసింది.అక్టోబరు 4న ధ్వజారోహణం, 12న చక్రస్నానం జరిగే రోజులు మినహా మిగతా రోజుల్లో దాతలను దర్శనానికి అనుమతిస్తారు.

పాము కాటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి


సోనిక (ఫైల్)

ములకలచెరువు, ఆగస్టు 20: పాము కాటుతో నాలుగేళ్ళ చిన్నారి మృతి చెందింది. ఈ విషాదకర సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ములకలచెరువు మండలం దేవళచెరువు పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన సింగారెడ్డి, మైథిలీ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భోజనం చేసి కుటుంబం మొత్తం ఇంట్లో కింద నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి దూరిన కట్ల పాము మధ్యలో నిద్రిస్తున్న రెండవ కుమార్తె సోనిక(4)కు కాటేసి చాప కిందకు వెళ్లింది. కొంత సేపటికి చిన్నారికి నోట్లో నురుగురావడంతో గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. దీంతో చిన్నారి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. చిన్నారి మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

అక్రమ ఇసుక డంప్ సీజ్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 20: బెంగళూరు రోడ్డు, బార్లపల్లె సమీపంలో వందలోడ్లకు పైగా అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంప్‌ను మంగళవారం తహసీల్దార్ ఖాజాబీ తమ సిబ్బందితో కలిసి పరిశీలించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశాల మేరకు బార్లపల్లె వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను పరిశీలించామని, ఈ స్థలంలో ఇసుక డంప్ చేసిన వారి వివరాలను సేకరించి నివేదిక ఇవ్వాలని స్థానిక వీఆర్వోను ఆదేశించారు. ఎక్కడైనా ఇసుక, మట్టి డపింగ్‌లు ఉంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గుర్రంకొండ, ఆగస్టు 20:అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. మండలంలోని ఇ.పసలవాండ్లపల్లెకు చెందిన హరికృష్ణారెడ్డి(30) అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంత్యక్రియల్లో అపశృతి..

కురబలకోట, ఆగస్టు 20: ఒక వ్యక్తి అంత్యక్రియల్లో అపశృతి జరిగిన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. మండలంలోని మలిపెద్దివారిపల్లెకు చెందిన తిప్పారెడ్డి తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహానికి అంత్యక్రియలలో భాగంగా టపాకాయలు పేల్చుతుండగా వాటి అగ్గి రవ్వలు టమోటా క్రేట్‌లపై పడటంతో అవి పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో హరినాథరెడ్డి అనే వ్యక్తి ఇంటి గోడలు కాలిపోయాయి.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం

● ఐదుగురు నిందితులు అరెస్టు...కారు సీజ్

ములకలచెరువు, ఆగస్టు 20: ములకలచెరువు మండలం పెద్దపాళ్యం రైల్వేగేటు వద్ద మంగళవారం దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కారును సీజ్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ రామ్మోహన్ తెలిపారు. కర్ణాటక నుంచి ములకలచెరువు మండలానికి కారులో అక్రమంగా కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా దాడి చేసి ఈ సందర్భంగా 18 బాక్సుల్లోని 1728 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నా రు. తంబళ్లపల్లె మండలం జుంజరపేటకు చెందన కదిరేంద్రబాబు(22) గాలివీడు మండలం తూముకుంట కు చెందిన శేషాద్రి (21), ములకలచెరువు మండలం దేవళచెరువుకు చెందిన రమణ(48), జయమ్మ(43),నరసమ్మ(48)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పంచాయతీలను అభివృద్ధి పరచాలి

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 19 : గ్రామ పంచాయతీల్లో సంపదను సృష్టించి అభివృద్ధి పదంలో నడిపించాలని మండల అభివృద్ధి అధికారి కేఎస్ బాలాజీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల రెండవ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ ఉంగరాల శివన్న, ఎంపీడీవో బాలాజీ, మండల విస్తరణాధికారి యోగానంద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి అందుకు తగినట్లు పనులు చేపట్టాలని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సర్పంచుల విధులు, ప్రణాళికలు మౌలిక వసతులు, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తదితర విషయాలపై క్షుణ్ణంగా వివరించారు. అనంతరం రంగసముద్రంలోని డంపింగ్ యార్డులో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు వర్క్‌షాపును నిర్వహించి డంపింగ్ యార్డుల నిర్వహణపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమాలకు సర్పంచ్‌లు బొక్సం శివప్రసాద్, శ్రీకంఠరెడ్డి, రహంతుల్ల, సుబ్బిరెడ్డి, కొండా కళావతి, చిన్నపరెడ్డి, అరుణ, చిన్నరెడ్డెప్పలతో పాటు పంచాయతీ కార్యదర్శులు శివప్రసాద్, నాగరాణి, సురేంద్రబాబు, మనోహర్, సురేఖ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.


పీటీఎంలో శిక్షణ తరగతులకు హాజరైన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు

చెత్త సేకరణతో సంపద సృష్టించడం తెలుసుకోవాలి

పెద్దమండ్యం, ఆగస్టు 20: గ్రామాలలో చెత్త సేకరణతో సంపద ఎలా సృష్టించవచ్చో సర్పంచ్‌లు, కార్యదర్శులు తెలుసుకోవాలని సర్పంచుల శిక్షణ తరగతుల ట్రైనర్లు మారప్ప, గిరిధర్‌నాయక్ పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలం సిద్దవరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో రెండవ రోజు మంగళవారం ట్రైనర్లు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీధర్‌రావు గ్రామ కార్యదర్శులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనర్లు మాట్లాడుతూ గ్రామాలలో గ్రామాలలో పరిశుభ్రత పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయకుమారి, పంచాయతీ కార్యదర్శులు, శైలజ, హేమంత్‌రెడ్డి, జగన్, జనార్ధన, బాలాజీ, ఖాదర్‌బాషా, జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని లోకేశ్‌కు వినతి


మంత్రి నారా లోకేశ్‌తో బి.కొత్తకోట నాయకులు

బి.కొత్తకోట, ఆగస్టు20: టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ను మంగళవారం ఉండవల్లిలో కలిసి తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించాలని టీడీపీ నేతలు విన్నవించారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా పార్టీకోసం గట్టిగా నిలబడి వైసీపీ దాడులను, కేసులను భరించామని తీరా అధికారంలోకి వచ్చాక అప్పటిదాకా వైసీపీలో వుండి తమను వేధించిన కొందరు నేడు తామే టీడీపీ సీనియర్ నాయకులని చెలామణీ అవుతూ తమపై కేసులు నమోదు చేయిస్తున్నారని లోకేశ్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. లోకేశ్‌ను కలిసిన వారిలో నియోజకవర్గ ఎస్సీసెల్ కన్వీనర్ సురేంద్ర, పార్లమెంటరీ బీసీసెల్ సెక్రటరీ ప్రకాష్, తెలుగుయువత టౌన్ అధ్యక్షుడు చాకనారాజా, బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుడుం రంజిత్, నియోజకవర్గ రైతుసంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవుడునాగరాజు, బూత్ కన్వీనర్ కుడుంశరత్ తదితరులున్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 20: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మదనపల్లె నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికరంగాన్ని అభివృద్ధి పరచిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. ఐటీ, టెలికం రంగానికి పునాదులు వేసింది రాజీవ్ గాంధీనే అన్నారు. అప్పట్లో ప్రపంచంతోనే సాంకేతికంగా భారతదేశం పోటీ పడేలా అడుగులు వేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మీనాకుమారి, మహబూబ్‌పీర్, నాగరాజ, రవి, సయ్యద్, ఈశ్వరమ్మ, పాలేటి, మహమ్మద్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించండి

నిమ్మనపల్లి, ఆగస్టు 20: మండలంలోని ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి 2025లోగా నివేదిక తయారు చేయాలని తహసీల్దార్ ధనంజేయులు బీఎల్‌వోలను ఆదేశించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో బీఎల్‌వోలతో ఓటర్ల జాబితాపై. ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి నుంచి సంబంధిత పత్రాలు స్వీకరించి ఓటర్ల జాబితాలో చేర్చాలన్నారు. అదేవిధంగా చనిపోయిన, గ్రామం వదిలి వెళ్లినవారి వివరాలు సేకరించి ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా పరిశీలనా బాధ్యతలు బీఎల్వోలదేనని మండల తహసీల్దార్ శ్రీరాములు నాయక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోల సమావేశంలో ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలనపై పలు సూచనలు ఇచ్చారు. బీఎల్వోలు ప్రతి రోజు విధిగా ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో ఆర్ఐ అనీషా, డిప్యూటీ తహసీల్దార్ దనంజయులు, వీఆర్వోలు, మూర్తి, మల్లిఖార్జున, సలీంబాష, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు నమోదు చేసుకోవచ్చు

పెద్దమండ్యం, ఆగస్టు 20: అర్హులైన వారు కొత్త ఓటరుగా ఈనెల 21వ తేదీ నుంచి నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో మంగళవారం ఓటరు నమోదు కార్యక్రమంపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేర్లు మార్పులు, చేర్పులు చేసుకొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. గ్రామాలలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. డీటీ గౌరిశంకర్, మండల సర్వేయర్ హసీన్‌తాజ్, వీఆర్‌వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట మండలంలోని బీఎల్వోలు అందరూ ఓటరు జాబితా పై ప్రత్యేక శ్రద్ధ కనపరచి జిల్లా కలెక్టర్ ఆదేశాల ఆదేశించిన షెడ్యూల్ మేరకు పనిచేయాలని తహశీల్దార్ శ్రీధర్‌రావు ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో బీఎల్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్18 వరకు నిరంతర ప్రక్రియలో బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటరుజాబితాలో మార్పులు చేర్పులు, సవరణలు, తొలగింపులపై విచారించాలన్నారు. అక్టోబరు29 నాటికి ఓటర్ల జాబితా ముసాయిదాను తయారు చేయాలన్నారు.

సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 20: సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలని సంఘ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఏలూరు జిల్లాలోని ద్వారాకా తిరుమలల్లో ఏపీ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసమావేశానికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శలు నారాయణమూర్తి, రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ, ట్రెజరర్ మదన్‌మోహన్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కొండా నిర్మల తదిరులు పాల్గొన్నారు. ఇందులో రాష్ట్ర సంఘానికి అన్నమయ్యజిల్లా మహిళా సభ్యురాలు ధనలక్ష్మీ 20 వేలు వితరణ చేశారు. . కార్యక్రమంలో నాయకులు ఉమామహేశ్వరు, సాగర్, వెంకటరమణ, ప్రకాష్, మంగపతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మదనపల్లె డీలర్ల నూతన కార్యవర్గం ఎంపిక

మదనపల్లె అర్బన్, ఆగస్టు 20: మదనపల్లె పట్టణ, రూరల్ మండల డీలర్ల నూతన కార్యవర్గం మంగళవారం ఎంపిక చేశారని డీలర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో మదనపనల్లె పట్టణ అధ్యక్షుడుగా షేక్ ఇమామ్ ఖాసీం, ఉపాధ్యక్షురాలుగా ముంతాజ్, రూరల్ అధ్యక్షుడుగా బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శులుగా వరద సుధీర్‌బాబు, సలహాదారులుగా రాజన్న, జేమురళి, కలకడ కళాధర్, అంజప్ప, టీజీ మహేశ్వర, ఎస్ ఖాజా హుసేన్, కార్యవర్గ సభ్యులుగా దివ్యావనందం, కవిత, షహనాజీబీ, మదన్మోహన్, జుచిత్ర, నాగేంద్రబాబు, ఏకగ్రీవంగా ఎంపికకాబడ్డారు. ఈ సందర్భంగా డీలర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూతన సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీలర్లు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 20: అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మైనింగ్ మాఫియా అక్రమంగా తరలించి నిల్వ చేసిన ఇసుక, మట్టి డంప్‌లను స్వయంగా పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మారినా అక్రమ మైనింగ్ మారలేదని ఆరోపించారు. అక్రమ మైనింగ్‌పై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో జగన్ బొమ్మలు తొలగింపు

మదనపల్లె టౌన్, ఆగస్టు 20: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో పలు చోట్ల మాజీ సీఎం జగన్ చిత్రాలను మంగళవారం తొలగించారు. ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన టీడీపీ నాయకులు అక్కడ ఆక్సిజెన్ ప్లాంటుకు, డీ ఆడిక్షన్ సెంటర్ వద్ద బోర్డుల్లో మాజీ సీఎం జగన్ ఫొటోలు కనిస్తుండటాన్ని గమనించి విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు సెక్యూరిటీ సిబ్బంది జగన్ ఫొటోలను తొలగించారు.

ఆర్టీసీ ఉద్యోగులు కలిసికట్టుగా పని చేయాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 20: ఆర్టీసీ ఉద్యోగులు కలిసి కట్టుగా పని చేయాలని స్థానిక వన్ డిపో డీఎం వెంకటరమణారెడ్డి సూచించారు. సమంగళవారం స్థానిక డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఇందులో మదనపల్లె వన్ అండ్ టూ డిపోల ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. వారికి అవగాహన కల్పించడానికి ముఖ్య అతిథులుగా జ్ఞానోదయ స్కూల్ కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు, హెడ్ కానిస్టేబుల్ రామమూర్తిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఓఆర్ 75 శాతం సాధించి వన్ డిపో రీజియన్‌లో మొదటి స్థానం, 71 శాతం సాధించి టూడిపో మూడో స్థానంలో ఉందని వారికి అభినందనలు తెలిపారు. అలాగే కేఎంపీఎల్ పెంచడానికి కృషి చేయాలన్నారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

● ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

ములకలచెరువు, ఆగస్టు 20: ములకలచెరువు మీదుగా రైళ్లు మంగళవారం ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుపతి నుంచి గుంతకల్లు జంక్షన్‌కు రాత్రివేళలో నడిచే ప్యాసింజర్ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 1.49 గంటలకు రావాల్సి ఉండగా 4.05 గంటలకు వచ్చింది. అలాగే మధ్యాహ్నం తిరుపతి నుంచి గుంతకల్లు జంక్షన్‌కు నడిచే రైలు ములకలచెరువుకు ఉదయం 10.39 గంటలకు రావాల్సి ఉండగా 12 గంటలకు వచ్చింది. నరసాపుర్ నుంచి ధర్మవరం జంక్షన్‌కు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ములకలచెరువుకు ఉదయం 6.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 7.56 గంటలకు వచ్చింది. దీంతో ప్రయాణికులు ఈ రైళ్ల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు

పీలేరు, ఆగస్టు 20: గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో గణిత శాస్త్రం, ఎంఎల్‌టీ, సీఎస్‌సీ సబ్జెక్టులకు గెస్ట్ లెక్చరర్ల ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని అన్నారు. ఎమ్మెస్సీలో మాథ్స్, బయోకెమెస్ట్రీ, మైక్రో బయాలజి, బీటెక్‌లలో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులు అన్నారు. ఈనెల 24న తేదీ సాయంత్రం నాగులు గంటల లోపు దరఖాస్తులు చేసుకుని 26వ తేదీ ఉదయం 10గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలని తెలియజేశారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

దోమ రహిత సమాజం క్షేమదాయకం

పీలేరు, ఆగస్టు 20: దోమ రహిత సమాజం క్షేమదాయకమని పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రశే ఖర్‌నాయక్ పేర్కొన్నారు. మంళవారం ప్రపంచ దోమల దినోత్స వం సందర్భంగా మండలంలోని పీహెచ్‌సీ తలుపుల, రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు, సిబ్బంది సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండ య్య, సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, సీహెచ్‌వో, జయ లక్ష్మి, పర్యవేక్షకులు కుసుమ, ఏయన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: దోమల నిర్మూలనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి అనుపమ, మునికుమార్ అన్నారు. మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా కన్నెమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సరిత, రెడ్డమ్మ పాల్గొన్నారు.

కలకడలో:అందరం కలిసి వ్యాధులకు మూలమైన దోమల నివారణను అరికడుదామని డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవార పాపిరెడ్డిగారిపల్లెలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అలాగే దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంతకుముందు వైద్యశాస్త్రంలో చిరస్మరణీయ సేవలందించిన సర్ రొనాల్డ్ రాస్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పురవీదులో నినాదాలు చేస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది జయరామయ్య, సుబ్బరత్న, రెడ్డెమ్మలు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతో జ్ఞాపకశక్తి పెంచుకోవచ్చు

మదనపల్లె టౌన్, ఆగస్టు 20: విద్యార్థులు పుస్తకపఠనంతో జ్ఞాపకశక్తి పెంపొందించుకోవచ్చని ప్రముఖ మానసిక శాస్త్రవేత్త ఎం.రాధాకృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అవగాహన సమావేశం నిర్వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు వారిలోని లోపాలను గుర్తించి సరిచేసుకోవాలన్నారు. కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



మదనపల్లె అర్బన్, ఆగస్టు 20: కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు శ్రావణమాస మంగళవారం ఆలయకమిటీ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అర్చనలు, అభిషేకాలు చేసి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి మొక్కులను చెల్లించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్వారి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, రంగస్వామి నాయుడు, కరుణాకర్‌నాయుడు, తేవేంద్ర, మార్వారి విక్కీ. మార్వారి మహేష్, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

భూ వివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు


సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

మదనపల్లె టౌన్, ఆగస్టు 20: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటనతో రాష్ట్ర ప్రభుత్వం విచారణ ముమ్మరం చేసి భూవివాదాల పరిష్కారానికి సెప్టెంబర్ నెలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో జగన్‌మోహన్‌రాజు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నెల రోజులుగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో ఎక్కువగా భూ సమస్యలపైనే ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పరిష్కరించేందుకు ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారన్నారు. ఈ సదస్సులు జరిగే రెండు రోజుల ముందే ఆయా గ్రామ సచివాలయాల వద్ద ప్రభుత్వ, ప్రైవేటు భూముల వివరాలు నోటీసు బోర్డులో ఉంచుతారన్నారు. వాటిని పరిశీలించిన ప్రజలు వారి భూములు అన్యాక్రాంతం అయ్యాయా లేదా అనే విషయంతో పాటు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయా అన్న విషయాన్ని ధృవీకరించుకోవచ్చన్నారు. మీ భూమికి చంద్రన్న తోడు ఉంటారని, ఇప్పటి వరకు జరిగిన భూ అక్రమాలను వెలికి తీస్తారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో విచారించి రైతులకు కొత్త పాసుపుస్తకాలు పంపిణీకి చర్యలు తీసుకుంటారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ల్యాండ్ టైటిలింగ్‌యాక్టు, ఫ్రీహోల్డ్ కార్యక్రమాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొరస్వామినాయుడు, ఆర్‌జే వెంకటేశ్, పి.సురేంద్రయాదవ్, ఎస్ఎం రఫి పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో స్వాతంత్ర్య వేడుకలు విజయవంతం


ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న ఉత్సవ కమిటి సభ్యులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 20: ప్రజల సహకారంతోనే మదనపల్లెలో మూడు రోజుల పాటు నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఉత్సవ కమిటీ, నిర్వాహకులు, సహాయకులను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, పురప్రముఖులు, కళాకారులు వేలాది సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారని, అందిరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులకు, విరాళాలు అందజేసిన ప్రముఖులను శాలువ కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రాటకొండ గురుప్రసాద్, ఎస్. సేతు, పి.శ్రీనివాసులు, రఘునాథరెడ్డి, లక్ష్మినారాయణ, కృష్ణప్ప, వెంకటరెడ్డి, గోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు విద్యాసాగర్, షంషీర్, నాదెళ్ల శివన్న, సహదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌమిత హంతకులను కఠినంగా శిక్షించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనివాస డిగ్రీ కళాశాల విద్యార్థులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 20: కోల్‌కత్తాలో ట్రైనీ వైద్యురాలు మౌమితను దారుణంగా హత్యాచారం చేసిన నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి కఠినంగా శిక్షించాలని శ్రీనివాస డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో కళాశాల విద్యార్థులు మౌన ప్రద ర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ 36 గంటల పాటు నిరవధికంగా రోగులకు సేవ లందించిన వైద్యురాలిపై ఇలాంటి ఘటన జరగడం శోచనీయమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలను మార్చాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన ఈ ర్యాలీ సంగం ఫంక్షన్ హాల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు సాగింది. కార్యక్రమంలో కళా శాల చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ బి.కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

● కోల్‌కత్తాలో ట్రైనీ వైద్యురాలు మౌమితను హత్యాచారం చేసిన వారిని ఉరి తీయాలని ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, జేవీవీ నాయకుడు హరీంద్రనాథ్ శర్మ డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా, జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు షహీనా, రెడ్డిప్రసన్న, ఉషారాణి, లక్ష్మి, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపరుడు సర్పంచు పదవికి అనర్హుడు

● పీలేరు టీడీపీ నాయకుల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతన్న పీలేరు టీడీపీ నాయకులు

పీలేరు, ఆగస్టు 20: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హబీబ్ బాషా పీలేరు సర్పంచు పదవిలో కొనసాగడానికి అనర్హుడని పీలేరు టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. హబీబ్ హయాంలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించిన అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందేనని అయినా మళ్ళీ అర్థాంతరంగా సర్పంచు పదవి చేపట్టడం అనైతికమని స్పష్టం చేశారు. మంగళవారం పలువురు స్థానిక టీడీపీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అవినీతి ఆరోపణలున్న హబీబ్ బాషా పంచాయతీలో ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో తీవ్రంగా విఫలమయ్యాడని ఆరోపించారు. పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా వేధించడం తగదని హితవు పలికారు. సమావేశంలో టీడీపీ నేతలు పోలిశెట్టి సురేంద్ర, పురం రామ్మూర్తి, శ్రీనాథరెడ్డి, శివా రెడ్డి షౌకత్ అలీ, నరేష్, కంచి నూరి, స్పోర్ట్స్ మల్లి, లడ్డూ జాఫర్, నల్లారి రియాజ్, చిన్నా, షమా, రెడ్డిముని, అత్తర్ చాంద్ బాషా, అశోక్, సందీప్ పాల్గొన్నారు.

అభయహస్తం పింఛన్లు పునరుద్ధరించుకోండి

తంబళ్లపల్లె, ఆగస్టు 20: తంబళ్లపల్లె మండలంలో గతంలో అభయహస్తం పింఛన్లు పొందుతూ వివిధ కారణాతో ఆగిపోయిన వాటిని అర్హులైన లబ్ధిదారులు తిరిగి పునరుద్ధరించుకునే అవకాశం ఉందని డీపీఎం ధర్మరాజు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీఎం గంగాధర్ ఆధ్వర్యంలో సంఘమిత్రలు, వివో సభ్యులతో అభయహస్తం, చంద్రన్న బీమా పాలసీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ..మండలంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, పలు రకాల వ్యాధిగ్రస్తులకు 23 రకాల పింఛన్లు మంజూరు అవుతున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు అర్హులైన లబ్ధిదారులకు అవగాహన కల్పించి వారికి లబ్ధిపొందే అవకాశం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, సీసీలు ఆదిలక్ష్మీ, భద్రయ్య, అంశీరాబేగం, సంఘమిత్రలు, సీసీలు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం జాగ్రత్తగా పర్యవేక్షించండి

మదనపల్లె టౌన్, ఆగస్టు 20: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదన్‌లో చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ శశికళ సూచించారు. మంగళవారం పట్టణంలోని బాలసదన్‌ను పీడీ పరిశీలించి చిన్నారులకు అందుతున్న అల్పాహారం, భోజనం, వంటగదిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లెలో చోటుచేసుకున్న ఫుడ్‌పాయిజన్ సంఘటన ఎక్కడా తిరిగి చోటుచేసుకోకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా బాలసదన్‌ను తనిఖీ చేయడంతో పాటు అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలిస్తున్నామన్నారు. బాలసదన్‌లో 100 మంది చిన్నారులను ఆశ్రయం ఇచ్చే అవకాశం వుండగా 46 మంది చిన్నారులు వున్నారన్నారు. బాలసదన్ నిర్వహణకు నిధులు పుష్కలంగా వున్నాయని, ఇక్కడ బాత్‌రూమ్‌లు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీడీ పీవో సుజాత, ఎంపీడీవో భానుప్రసాద్, బాలసదన్ సూపరింటెండెంట్ ఉమా, వైద్యులు, పాల్గొన్నారు.

పాఠశాల నుంచే చట్టాలపై అవగాహన ఉండాలి

తంబళ్లపల్లె, ఆగస్టు 20: పాఠశాల స్థాయి నుంచే బాలబాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో నాగవేణి సూచించారు. మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో బాగంగా తంబళ్లపల్లె ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో బాలబాలికలకు చట్టాలపై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, పిల్లలపై జరుగుతున్న హింస, వేధింపులు,హెల్ప్ లైన్ గురించి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉపాధిహామీపై అన్నిపంచాయతీలలో గ్రామసభలు

బి.కొత్తకోట, ఆగస్టు20: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం అమలు పై ఈ నెల 23న బి.కొత్తకోట మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల ఏపీవో మంజుల తెలిపారు. మంగళవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆయా గ్రామపంచాయతీలలో ఉపాధిహామీ పథకంద్వారా చేపట్టిన పనులు, వాటికోసం వెచ్చించిన నిధుల వివరాలు ప్రజలకు వివరిస్తామన్నారు. అదేవిధంగా 2024-25 లో చేపట్టాల్సిన పనులు, సామాజికతనిఖీ అంటే ఏమిటన్న విషయంపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ గ్రామసభల తీర్మానం కాపీలను ఆయా పంచాయతీ కార్యదర్శులు సంబంధిత మొబైల్‌యాప్ ద్వారా పొందుపరుస్తారన్నారు. ఉపాధిహామీ కూలీలతో పాటు గ్రామస్థులు సభలలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.